విలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలుబడుతున్న

ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక

తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492



www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక





| హైదరాబాద్ | సంచిక : 1 | సంపుటి : 323 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | జూన్ 2025 | వెల : రూ 10/- |
| --- | --- | --- | --- | --- | --- |




వీలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలుబడుతున్న

ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక

తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492



www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక







హైదరాబాద్ | సంచిక : 1 | సంపుటి : 323 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | జూన్ 2025 | వెల : రూ 10/-


## నేడు తెలంగాణ రాష్ట్ర
# అవతరణ దినోత్సవం

### 'జై తెలంగాణ' నినాదంతో కదం తొక్కిన సబ్బండవర్ణాలు




- వలసవాదుల దోపిడీపై గర్జించిన ఉద్యమ గుమ్మం
- మలిదశ ఉద్యమంలోనూ మడమతిప్పని పోరాటం
- ఉద్యమానికి ఊపిరిలూదిన ఉమ్మడి జిల్లా పోరుబిడ్డలు
- కేసీఆర్ దీక్షతో స్వరాష్ట్ర సాకారం.. పులకించిన పురిటిగడ్డ

**ఖమ్మం,**

'మా నిధులు మాకే.. మా ఉద్యోగాలు మాకే..' అనే నినాదంతో తెలంగాణ ఆకాంక్ష తొలికేకను ప్రతిధ్వనించింది ఉమ్మడి ఖమ్మం జిల్లా. వలసవాదుల దోపిడీకి వ్యతిరేకంగా గొంతెత్తి గర్జించింది. సీమాంధ్ర పాలకవర్గాల ప్రాంతీయ వివక్షపై పిడికెళ్లెత్తింది. నాలుగున్నర కోట్ల ఆకాంక్షకు పురుడు పోసింది. తొలి దశ, మలి దశ ఉద్యమాల్లో మడమతిప్పని పోరాట పటిమను ప్రదర్శించింది ఉద్యమ ఖిల్లా. అమరుల త్యాగాలను గుండెలకత్తుకున్న ఖమ్మం మెట్టు.. స్వరాష్ట్ర సాధనలో అలుపెరగని పోరు చేసింది. తెలంగాణ ఉద్యమ చరిత్ర పుటల్లో చిరస్థాయిగా నిలిచింది. సీమాంధ్ర పాలకుల వివక్షకు, వలసవాదుల దోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమాల ఖిల్లా

-మిగతా 3 లో



## ఆపరేషన్ సిందూర్‌ను
# కూడా వదల్లేదు..

- టీఎంసీకి గట్టి గుణపాఠం చెప్పాలి
- మమతా బెనర్జీపై అమిత్‌షా ఫైర్

**న్యూఢిల్లి**

ముస్లింల ఓటు బ్యాంకు కోసమే ఆపరేషన్ సిందూర్ ( వక్ఫ్ సవరణ చట్టాన్ని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వ్యతిరేకిస్తున్నారని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అన్నారు. ఆపరేషన్ సిందూర్‌కు వ్యతిరేకంగా మాట్లాడటం ద్వారా ఈ దేశంలోని తల్లులు, సోదరీమణులను అగౌరవపరుస్తున్నారని తప్పుపట్టారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర మహిళలంతా ముఖ్యమంత్రికి, టీఎంసీకి

-మిగతా 3 లో



## 3,700 దాటిన
# కరోనా కేసులు

- కొత్తగా 360 మందికి పాజిటివ్
- కొవిడ్‌తో మరో ఇద్దరి మృత్యువాత

**న్యూఢిల్లీ**

దేశంలో కరోనా వైరస్ క్రమంగా కోరలు చాస్తున్నది. కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం.. జూన్ 1 ఉదయం 8 గంటల సమయానికి దేశంలో యాక్టివ్ కేసుల సంఖ్య 3,758కి పెరిగింది. వీటిలో అత్యధికంగా కేరళలో 1400 కేసులు, మహారాష్ట్రలో 485, ఢిల్లీలో 436 కేసులు ఉన్నాయి.విడ్‌తో గత 24 గంటల్లో మరో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. వీరిలో ఒకరు కేరళకు చెందినవారు కాగా, మరొకరు కర్ణాటకకు చెందినవారు. కొవిడ్ కారణంగా ఈ ఏడాది ఇప్పటివరకు మరణించిన వారి సంఖ్య 28కి పెరిగింది.

# స్వయంపాలన స్ఫూర్తి కొనసాగాలి

- ప్రజల్లో ప్రభుత్వం విశ్వాసం నింపాలి
- ఇచ్చిన హామీలను అమలు చేయాలి
- ప్రజలకు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన కేసీఆర్

**హైదరాబాద్,**

ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రజల్లో విశ్వాసం నింపాలని రాష్ట్ర ప్రభుత్వానికి బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సూచించారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. శాంతియుతంగా

-మిగతా 3 లో





# స్వీయ ప్రశంసలు ఆపాలి

### ప్రధానిపై కాంగ్రెస్ చీఫ్ విమర్శలు


**బెంగళూరు**

స్వీయ ప్రశంసలు మాని శత్రువులపై దృష్టి పెట్టాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి సూచించారు. బెంగళూరులో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్ అనంతరం ప్రధాని నరేంద్ర మోడీ బహిరంగ ప్రసంగాల గురించి ప్రస్తావించారు. మోడీ ఎన్నికల ప్రచారం నుండి తప్పుకోవాలని కోరారు. మోడీ వ్యాఖ్యలపై స్పందించడం తనకు ఇష్టంలేదని, కానీ అధికారంలో ఉన్న వారు నోరు అదుపులో పెట్టుకోవాలనేదే తన అభ్యర్థన అని అన్నారు. ప్రధానమంత్రి ఇటీవలి బహిరంగ ప్రకటనలు, రాజకీయ కార్యకలాపాలపై ఖర్గే ప్రశ్నల వర్షం కురిపించారు. ఎన్నికల ప్రచారల నుండి తప్పుకుని దేశంపై దృష్టి

-మిగతా 3 లో

## 5న మంత్రివర్గ
# సమావేశం

### కీలకాంశాలపై చర్చించనున్న రాష్ట్ర క్యాబినెట్



- పూర్తిస్థాయి పరిశీలన తర్వాతే యువ వికాసం జాబితా
- మంత్రివర్గంలో చర్చించాకే ఉద్యోగుల సమస్యలపై నిర్ణయం



**హైదరాబాద్–**

రాష్ట్ర మంత్రివర్గ సమావేశాన్ని ఈనెల ఐదున నిర్వహించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ఆదివారం హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఆయన మంత్రులతో భేటీ అయ్యారు. రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు, ఇందిరమ్మ ఇండ్లు, రెవెన్యూ సదస్సులు, వాన కాలం పంటల సాగు సన్నద్ధత, రాజీవ్ యువ వికాసం తదితరాంశాలపై మంత్రులు ఈ సందర్భంగా సీఎంకు నివేదిక సమర్పించారు. మే 29, 30 తేదీల్లో జిల్లాల్లో పర్యటించిన మంత్రులు ఈ నాలుగు అంశాలపై

-మిగతా 3 లో



# మస్క్‌కు ట్రంప్ షాక్

- ఎలన్ సహచరుడి నామినేషన్‌కు నో

**వాషింగ్టన్ –**

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తన సలహాదారు ఎలన్ మస్క్‌కు షాక్ ఇచ్చారు. నాసా అధిపతిగా మస్క్ సూచించిన బిలియనీర్ జేర్డ్ ఐసాక్‌మాన్ నామినేషన్‌ను వెనక్కి తీసుకుంటున్నట్లు ప్రకటించారు. ఐసాక్‌మాన్ 'పూర్వ సంబంధాల'ను కూలంకషంగా సమీక్షించిన తర్వాత ఈ నిర్ణయానికి వచ్చానని శనివారం రాత్రి ట్రంప్ తెలియజేశారు. కాగా ఈ నిర్ణయం వెనుక ట్రంప్ ఉద్దేశమేమిటో స్పష్టంగా తెలియడం లేదు. వివరణ కోరుతూ శ్వేతసౌధానికి ఈ-మెయిల్ పంపగా సమాధానం రాలేదు. 'ఐసాక్‌మాన్ పూర్వ సంబంధాలను కూలంకషంగా సమీక్షించిన తర్వాత నాసాకు నేతృత్వం వహించేందుకు ఆయన నామినేషన్‌ను వెనక్కి తీసుకుంటున్నాను' అని ట్రంప్ తన సామాజిక మాధ్యమ వేదికలో తెలిపారు. త్వరలోనే నూతన

-మిగతా 3 లో




# పోలీసు సేవా పతకాలు ప్రకటించిన తెలంగాణ ప్రభుత్వం

### 9 మంది పోలీసు కు శౌర్య పతకం

**హైదరాబాద్**

నేడు తెలంగాణ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని . రాష్ట్ర ప్రభుత్వం పోలీసు సేవా పతకాలను ప్రకటించింది. రాష్ట్రంలోని పోలీసు శాఖలో విశిష్ట సేవలందించిన అధికారులను గుర్తించి ప్రభుత్వం గౌరవించింది. ఈ మేరకు శనివారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఈ ఏడాది మొత్తం 25 మంది పోలీసు సిబ్బందికి పతకాలు లభించాయి. వీరిలో 9 మంది శౌర్య పతకం ను పొందగా,

# కేటీఆర్ యూకే పర్యటన సక్సెస్

### బీఆర్ఎస్ యూకే సెల్ నేతలతో మీట్



- తెలంగాణ విజయాలను వివరిస్తూ పెట్టుబడులను ఆహ్వానిస్తూ మీటింగ్స్
- బ్రిడ్జ్ ఇండియా సదస్సుకు హాజరు
- పెట్టుబడులు పెట్టాలంటూ విజ్ఞప్తి
- భారీగా తరలివచ్చిన అభిమానులు
- లండన్ నుంచి డాలస్‌కు పయనం
- నేడు డాలస్‌లో బీఆర్ఎస్ రజతోత్సవ సభ, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో పాల్గొననున్న కేటీఆర్

**హైదరాబాద్**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ యూకే పర్యటన జయప్రదమైంది. ఐదురోజుల పాటు ఇంగ్లండ్‌లో పర్యటించిన ఆయన పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ సాధించిన విప్లవాత్మక విజయాలను వివరించారు. అధికారం లేకున్నా విదేశీగడ్డపై తెలంగాణ ప్రత్యేకతను చాటిచెప్తూ ఇండియాలో పెట్టుబడులు పెట్టాలని, అందులో తెలంగాణను బెస్ట్ చాయిస్‌గా ఎంచుకోవాలని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. ఆదివారం డాలస్‌కు పయనమయ్యారు. అక్కడ సోమవారం నిర్వహించనున్న తెలంగాణ

-మిగతా 3 లో



# తెలంగాణ ఆతిథ్యానికి రుణపడి ఉంటా..

## బంగ్లా మాజీ ప్రధాని హసీనా పై మరో నేరాభియోగం



**న్యూఢిల్లీ**

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా పై అక్కడి ప్రాసిక్యూటర్లు మరో నేరాభియోగం మోపారు. సామాన్య పౌరులపై క్రూరత్వం ప్రదర్శించినట్లు ఆరోపణలు చేశారు. 2024లో విద్యార్థుల ఉద్యమాన్ని ఆమె క్రూరంగా అణచివేయాలని చూసినట్లు అభియోగంలో పేర్కొన్నారు. భద్రతా దళాలు, తన పార్టీ సభ్యులు ఈ ఉద్యమాన్ని అణచివేసేందుకు చర్యలు తీసుకోవాలని హసీనా నేరుగా ఆదేశించినట్లు గుర్తించామని చెప్పారు.ఇందుకు సంబంధించిన ఎన్‌క్రిప్టెడ్ కమ్యూనికేషన్‌లు, వీడియో ఆధారాలు ఉన్నాయని చీఫ్ ప్రాసిక్యూటర్ తాజుల్ ఇస్లాం ఆదివారం తెలిపారు. దీనికి 81 మందిని సాక్షులుగా పేర్కొన్నారు. దేశంలో సంక్షోభ సమయంలో భద్రతాదళాలు తీసుకున్న చర్యలకు నాటి దేశాధినేత హసీనాదే బాధ్యత అని తాజుల్ చెప్పారు. ఆమె చేపట్టిన అణచివేత కార్యక్రమంలో దాదాపు 1500 మంది మరణించగా 25,000 మంది గాయపడ్డారు. గత ఏడాది బంగ్లాదేశ్‌లో అల్లర్లు చెలరేగడంతో ఆ దేశ ప్రధాని పదవికి షేక్ హసీనా రాజీనామా చేశారు. దాదాపు 15 ఏళ్లపాటు ఆమె దేశాన్ని పరిపాలించారు. గత ఆగస్టులో ఆమె ఢాకాను వీడి న్యూఢిల్లీకి చేరుకున్నారు. నాటి నుంచి ఆమె అక్కడే ఆశ్రయం పొందారు. బంగ్లాదేశ్‌లో యూనస్ నేతృత్వంలో ఏర్పడిన ప్రభుత్వం వరుసగా హసీనాపై కేసులను బనాయిస్తోంది. ఆమె కుటుంబ సభ్యులపై పలు ఆరోపణలు వచ్చాయి. మరోవైపు ఆమెపై ఇప్పటికే 100కు పైగా కేసులున్నాయి. ఇప్పటికే ఇంటర్నేషనల్ క్రైమ్ ట్రిబ్యునల్ ఆమెపై అరెస్టు వారెంట్ జారీ చేసింది. ప్రస్తుతం ఈ కేసు విచారణ కొనసాగుతోంది.

## మాక్ డ్రిల్ సమయంలో తేనెటీగల దాడి..

**పరుగులు తీసిన అధికారులు**



**జైపూర్ –**

రాజస్థాన్‌లోని పాకిస్థాన్ సరిహద్దు జిల్లాలతో పాటు, ఆ రాష్ట్రం అంతటా శనివారం 'ఆపరేషన్ షీల్డ్' పేరుతో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సమయంలో పలువురు అధికారులపై తేనెటీగలు దాడి చేశాయి. దీంతో వారంతా పరుగులు తీశారు. ఈ సంఘటన రియల్ మాక్ డ్రిల్‌ను తలపించింది. ఝులావర్‌లోని కాలిసింధ్ డ్యామ్ వద్ద మాక్ డ్రిల్ సందర్భంగా డ్రోన్ దాడి జరుగుతుందన్న పరిస్థితి నెలకొన్నది. అయితే అదే సమయంలో అక్కడున్న కలెక్టర్, ఎస్పీతో సహా చాలా మంది అధికారులు, ఉద్యోగులపై తేనెటీగలు దాడి చేశాయి. దీంతో వారంతా సురక్షిత ప్రాంతాలకు పరుగులు తీశారు.కాగా, మాక్ డ్రిల్‌లో భాగంగా రాజస్థాన్ అంతటా శనివారం రాత్రి 8 గంటల నుంచి వేర్వేరు సమయాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. వివిధ నగరాల్లో 15 నిమిషాల నుంచి 25 నిమిషాల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. బ్లాక్‌అవుట్ సమయంలో, ప్రజలు తమ ఇళ్ళు, షాపులు, కార్యాలయాల్లో లైట్లు ఆర్పివేశారు. రోడ్లపై వాహనాలు కూడా ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. హెడ్‌లైట్‌లను కూడా ఆపివేశారు. జైపూర్‌లోని ఖతిపురా రోడ్డులో ఉన్న ప్రభుత్వ స్కూల్ గ్రౌండ్‌లో డ్రోన్, క్షిపణి దాడులతో రియల్ టైమ్ మాక్ డ్రిల్ నిర్వహించారు.

## వరుసగా రెండో నెల 2 లక్షల కోట్లు దాటిన జీఎస్టీ వసూళ్లు



**న్యూఢిల్లీ**

స్థూల వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు వరుసగా రెండో నెల రూ.2 లక్షల కోట్లు దాటాయి. ఏప్రిల్‌లో జీఎస్టీ వసూళ్లు రికార్డు స్థాయిలో రూ.2.37 లక్షల కోట్లు కాగా, మే నెలలో రూ.2,01,050 కోట్లు. నిరుడు మే నెలలో ఈ వసూళ్లు రూ.1,72,739 కోట్లు. ఈ ఏడాది మే నెలలో దేశీయ లావాదేవీల నుంచి వచ్చిన గ్రాస్ రెవిన్యూస్ 13.7 శాతం పెరిగి, రూ.1.50 లక్షల కోట్లకు చేరాయి.దిగుమతుల నుంచి జీఎస్టీ రెవిన్యూ 25.2 శాతం పెరిగి, రూ.51,266 కోట్లకు చేరింది. డెలాయిట్ ఇండియా పార్టనర్ ఎంఎస్ మణి మాట్లాడుతూ, రాష్ట్రాల నుంచి జీఎస్టీ వసూళ్ల వృద్ధిలో అంతరాలపై క్షుణ్ణంగా విశ్లేషణ జరగాలన్నారు. మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, కర్ణాటక, తమిళనాడు వంటి పెద్ద రాష్ట్రాల్లో ఈ పెరుగుదల 17–25 శాతం కాగా, గుజరాత్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వంటి రాష్ట్రాల్లో 6 శాతం వరకు మాత్రమే పెరుగుదల కనిపించిందన్నారు.

**ప్రభాస్ బాహుబలి మూవీకి రివ్యూస్తా మిస్ వరల్డ్ చువాంగ్‌శ్రీ..!**

**న్యూఢిల్లీ–**

తెలంగాణలో ఆతిథ్యానికి రుణపడి ఉంటానని మిస్ వరల్డ్ ఓపల్ సుచాత చువాంగ్‌శ్రీ పేర్కొన్నారు. హైదరాబాద్ వేదికగా జరిగిన మిస్ వరల్డ్ 2025 కిరీటాన్ని హైదరాబాద్ హైటెక్స్ వేదికగా శనివారం జరిగిన పోటీల్లో థాయ్‌లాండ్ సుందరి ఓపల్ సుచాత చువాంగ్ సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. 72వ మిస్ వరల్డ్ గెలిచిన ఈ థాయ్ సుందరి మాట్లాడుతూ.. ఈ విజయం తనకు ఎంతో సంతోషం కలిగించిందని చెప్పింది. బ్యూటీ విత్ పర్పస్‌ని మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు కృషి చేస్తానని పేర్కొంది. తెలంగాణలో సోషల్ సర్వీస్ చేయనున్నట్లు పేర్కొంది. మిస్ వరల్డ్ కిరీటం అందుకునే సమయంలో భావోద్వేగానికి గురయ్యానని.. అదే సమయంలో షాక్‌కు గురయ్యానని చెప్పింది. పోటీల్లో తాను మాత్రమే విజేతను కానని.. పోటీదారులంతా తన దృష్టిలో విజేతలేనని చెప్పింది. ఇక్కడ మొదలైన తన ప్రయాణం చాలా అద్భుతమని.. ఈ జర్నీలో చాలా విషయాలు నేర్చుకున్నానని చెప్పింది. తెలంగాణ ప్రజలు గౌరవ ఆతిథ్యం ఇచ్చారని.. వారిని మరిచిపోలేనని చెప్పింది. తెలంగాణ టూరిజాన్ని



ప్రమోటం చేయడం తనకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని చెప్పింది. మిస్ వరల్డ్ కావాలన్న తన కల నెరవేరిందని చెప్పింది. హైదరాబాద్ అంటే తనకు ఇష్టమని, తెలంగాణ ఆతిథ్యం బాగుందని చెప్పింది. చౌమహల్లా ప్యాలెస్, పిల్లలమర్రి చాలా బాగున్నాయని.. ఓపల్ ఫర్ హర్ ప్రాజెక్టు కోసం మరింత కృషి చేస్తానని చెప్పుకొచ్చింది.ఈ సందర్భంగా భారీయ చిత్రాలు, నటీనటుల గురించి సైతం థాయ్ సుందరి మాట్లాడింది. భారత్ నుంచి మిస్ వరల్డ్‌గా విజయాన్ని అందుకున్న వారిలో ఎవరంటే ఇష్టం అని మీడియా ప్రశ్నించగా.. ఈ ప్రశ్నకు సమాధానం చెప్పడం కష్టమేనని చెప్పింది. తనకు ఇష్టమైన మానుషి చిల్లర్‌ను ఫైనల్‌లో కలిశానని.. అలాగే, తనకు ప్రియాంక చోప్రా సైతం ఇష్టమేనని చెప్పింది. ఆమె నుంచే తాను స్ఫూర్తి పొందానని.. తనకు వీలున్న సమయంలో సినిమాలు చూస్తానని తెలిపింది. పలు బాలీవుడ్ సినిమాలు చూస్తానని.. తనకు అలియాభట్ తెలుసునని చెప్పింది. అలియా నటించిన గంగూబాయి కథియావాడి నాకెంతో నచ్చిందని.. అది మూవీ ప్రేక్షకులను ఆలోచింప చేసేలా ఉందని చెప్పింది.యితే, బాహుబలి మూవీ గురించి విన్నానని.. ఆ మూవీ చూడలేదని పేర్కొంది. పోటీలు పూర్తయ్యాక ఆ మూవీని చూడాలని నాకు నేనే ఒట్టు వేసుకున్నానని.. మళ్లీ ఇక్కడికి వచ్చే నాటికి తప్పకుండా ఆ మూవీపై రివ్యూ ఇస్తానని చెప్పింది. అవకాశం వస్తే బాలీవుడ్ సినిమాలో నటిస్తానని.. అదే నాకు ఓ మంచి అవకాశం అవుతుందని చెప్పుకొచ్చింది. మిస్ వరల్డ్ కిరీటం గెలువడం తన జీవితంలో అద్భుతమైన రోజని.. వ్యక్తిగతంగానే కాకుండా థాయ్‌లాండ్ ప్రజలకు మైలురాయిగా అభివర్ణించింది. ఈ విషయంలో తాను గర్వపడుతున్నానని.. మిస్ వరల్డ్ వేదికపై తమ దేశానికి గుర్తింపు లభించిందని పేర్కొంది.

## మావోయిస్టుల కుట్రను భగ్నం చేసిన భద్రతా బలగాలు

**రాయ్‌పూర్,**

ఛత్తీస్‌గఢ్ నారాయణపూర్ జిల్లాలోని మావోయిస్టుల కుట్రను భద్రతా బలగాలు భగ్నం చేశాయి. కూబింగ్ నిర్వహిస్తున్న భద్రతా బలగాలే లక్ష్యంగా చేసుకుని 10 ఐఈడీలను మావోయిస్టులు అమర్చారు. కూబింగ్‌లో భాగంగా ఐఈడీ బాంబులను భద్రతా బలగాలు గుర్తించాయి. అనంతరం వాటిని బలగాలు నిర్వీర్యం చేసి.. స్వాధీనం చేసుకున్నాయి. ఆదివారం ఉదయం కోహ్కమెట పోలీస్ స్టేషన్ పరిధిలోని క్యాంప్ కుతుల్ గ్రామం ఖోద్పర్, గుర్కా అటవీ రహదారిలో భద్రతా బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ఆ క్రమంలో వీటిని అవి గుర్తించాయి. ఇక ఈ ప్రాంతంలోనే మావోయిస్టులు నక్కి ఉండే అవకాశం ఉందంటూ భద్రతా బలగాలు భావిస్తున్నాయి. అందులో భాగంగా ఆ పరిసర ప్రాంతాల్లో బీడీఎస్ బృందాలతో కలిసి భద్రతా బలగాలు కూంబింగ్ నిర్వహిస్తున్నాయి.మరోవైపు వచ్చే ఏడాది మార్చి నాటికి దేశంలో మావోయిస్టులను నిర్మూలించడమే లక్ష్యంగా కేంద్రం ఆపరేషన్ కగార్ పేరుతో వ్యూహాత్మకంగా



అడుగులు వేస్తుంది. దీంతో ఇప్పటికే జరిగిన వివిధ ఎన్‌కౌంటర్లలో భారీగా మావోయిస్టులు మరణించారు. అలాగే వందల మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. మరికొంత మందిని పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే.ఇంకోవైపు మావోయిస్టులకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని కేంద్రం ఇటీవల విడుదల చేసింది. గతంలో కంటే మావోయిస్టుల హింస దాదాపుగా అంటే.. పూర్తిగా తగ్గిపోయిందని తెలిపింది. 2010లో మావోయిస్టుల హింసాత్మక సంఘటనలు 1936 ఉంటే అవి 2024 నాటికి 374కు తగ్గిపోయాయని వివరించింది. అంటే దాదాపు 81 శాతం మేర మావోయిస్టుల హింస తగ్గిందని సోదాహరణగా వివరించింది. అలాగే దేశంలో 2013లో మావోయిస్టుల ప్రభావిత జిల్లాలు 126గా ఉంటే.. అవి 2021 నాటికి 70.. ఇక ప్రస్తుత ఏడాది ఏప్రిల్ నాటికి అవి 18కి పరిమితమైనాయని గణాంకాలతో సహా సోదాహరణగా వివరించింది. మావోయిస్టుల హింసలో 2010 నాటికి 720 మంది పౌరులు మరణిస్తే.. 2019కి ఆ సంఖ్య 150కి చేరిందని.. ఇక 2023లో 106, 2024లో 131, ప్రస్తుత ఏడాది మాత్రం 19 మంది మరణించారని కేంద్రం గణాంకాలతో సహా వివరించింది.

## ఉక్రెయిన్‌పై విరుచుకుపడ్డ రష్యా..

**12 మంది సైనికుల మృతి.. మాస్కోపై కీవ్ ప్రతీకార దాడులు..!**

**రష్యా––**

రష్యా–ఉక్రెయిన్ మధ్య మరోసారి ఉద్రిక్తతలు పెరిగాయి. ఉక్రెయిన్ సైనిక శిక్షణా విభాగం ప్రదేశంలో ఆదివారం రష్యా జరిపిన క్షిపణి దాడిలో కనీసం 12 మంది ఉక్రెయిన్ సైనికులు ప్రాణాలు కోల్పోయారు. మరో 60 మందికిపైగా గాయపడ్డారని ఉక్రెయిన్ గ్రౌండ్ ఫోర్సెస్ తెలిపింది. మధ్యాహ్నం 12:50 గంటలకు ఈ దాడి జరిగిందని పేర్కొంది. అయితే, రష్యా ఒకేసారి 472 డ్రోన్లను ప్రయోగించిందని.. ఇందులో 385 డ్రోన్లను అడ్డుకున్నట్లు చెప్పింది. దాడికి దారి తీసిన పరిస్థితులను వెలికితీసేందుకు ఓ దర్యాప్తు కమిషన్‌ని ఏర్పాటు చేసినట్లు ప్రకటనలో పేర్కొంది. ఉక్రెయిన్‌లోని ఉత్తర సుమీ ప్రాంతంలో ఒలెక్సివ్కాని తమ ఆధీనంలోకి తీసుకున్నట్లు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ ఆదివారం తెలిపింది. రష్యా దాడులతో ఉక్రెయిన్ సైతం ప్రతీకార దాడులకు తెగబడింది. ఉక్రెయిన్ పెద్ద



సంఖ్యలో డ్రోన్‌లతో మాస్కోపై దాడికి పాల్పడింది. అయితే, భారీ మొత్తంలో ఉక్రెయిన్ దాడులకు పాల్పడడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.తూర్పు సైబీరియా సరిహద్దులోని సైనిక స్థావరాలే లక్ష్యంగా సుదీర్ఘంగా ప్రయాణించ గల డ్రోన్లను ఉక్రెయిన్ ప్రయోగించింది. ఉక్రెయిన్ దాడిని రష్యాలోని ఇర్కుట్స్ గవర్నర్ ధ్రువీకరించారు. ఆ దేశానికి చెందిన రిమోట్ పైలట్ ఎయిర్‌క్రాఫ్ట్ మిలటరీ యూనిట్‌ను ధ్వంసం చేసినట్లు చెప్పారు. ఒలెన్యా, బెలయా సహా నాలుగు మిలటరీ ఎయిర్‌బేస్‌లపై దాడులు జరిగినట్లు తెలిపింది. అయితే, ఉక్రెయిన్ సెక్యూరిటీ సర్వీస్ ఆపరేషన్లో 40పైగా రష్యన్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు ధ్వంసమైనట్లుగా కీవ్ మీడియా పేర్కొంది. టీయూ 95, టీయూ–22ఎం3 బాంబర్లు, ఏ–50 ఎయిర్ క్రాఫ్ట్ కూడా ధ్వంసమైనట్లు సమాచారం. ఇరుదేశాల మధ్య యుద్ధం మొదలైన తర్వాత పెద్ద ఎత్తున ఉక్రెయిన్ రష్యాలపై దాడులు చేయడం ఇదే తొలిసారి. ఇదిలా ఉండగా.. తాజా పరిణామాల నేపథ్యంలో ఉక్రెయిన్‌తో చర్చలకు రష్యా మరోసారి కోరింది. అయితే, మంత్రి రుస్టెమ్ ఉమెరోవ్ నేతృత్వంలోని ఓ బృందం ఇస్తాంబుల్‌కు బృందం చేరుతుందని అధ్యక్షుడు జెలెన్స్కీ తెలిపారు

## ఆపరేషన్ సిందూర్‌పై వ్యాసరచన పోటీలు

**న్యూఢిల్లీ**

ఇటీవల పాకిస్థాన్‌పై భారత్ నిర్వహించిన ఆపరేషన్ సిందూర్‌పై ఈ నెల 1 నుంచి 30 వరకు దేశ వ్యాప్తంగా వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్టు రక్షణ శాఖ ఆదివారం ప్రకటించింది.ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన మొదటి ముగ్గురికి రూ.10 వేల చొప్పున బహుమతి అందజేయడమే కాక ఢిల్లీలోని ఎర్రకోటలో జరిగే 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు హాజరయ్యే అవకాశం కల్పిస్తామని ఎక్స్‌లో తెలిపింది. అభ్యర్థులు ఆంగ్లం, హిందీలలో వ్యాసాలను పంపాలని కోరింది.



# నేడు తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం

(మొదటి పేజి తరువాయి)

ఖమ్మం జిలా 'జై తెలంగాణ' అంటూ తొలికేక పెట్టింది. నిధులు, నీళ్లు, నియామకాల్లో వివక్షను తట్టుకోలేక 1969లోనే 'జై తెలంగాణ' అంటూ గర్జించింది. స్వరాష్ట్రం, స్వపరిపాలన కోరుతూ ప్రత్యేక రాష్ట్రం నినాదానికి పురుడుపోసింది. ఈ క్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ఎందరో ముద్దుబిడ్డలు రక్త తర్పణం చేశారు. వీరుల త్యాగాలను పుణికిపుచ్చుకున్న పురిటిగడ్డ పోరుబిడ్డలు.. మలిదశ ఉద్యమంలోనూ మడమతిప్పలేదు. విద్యార్థులు, మేధావులు, కార్మికులు, కర్షకులు, ఉద్యమ పార్టీల నేతలు, కార్యకర్తలు నాటి పోలీసుల నిర్బంధాలను లెక్కచేయలేదు.

ఉద్యోగులు కూడా సీమాంధ్ర పాలకుల బెదిరింపులను పక్కన పెట్టి.. భావితరాల కోసం జీవితాలనే (కొలువులనే) పణంగా పెట్టి అలుపెరగని ఉద్యమాలు చేశారు. ఉద్యమ సారథి కేసీఆర్ కూడా ఆమరణ దీక్షకు పూనుకున్నారు. తెలంగాణలోని సబ్బండ వర్గాలూ ఆయనకు వెన్నుదన్నుగా నిలిచాయి. ఫలితంగా చివరకు పార్లమెంటు సాక్షిగా తెలంగాణ బిల్లు ఆమోద ముద్ర వేసుకుంది. 2014 జూన్ 2న స్వేచ్ఛావాయువులతో స్వరాష్ట్రం అవతరించింది. పోరాటాల పురిటిగడ్డ పులకించిపోయింది.

**తెలంగాణ తొలికేక ఖమ్మానిదే..**

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారసత్వంతో విప్లవ భావజాలాన్ని పుణికి పుచ్చుకున్న ఖమ్మం బిడ్డలు.. ఉద్యోగాల్లో జరుగుతున్న అన్యాయంపై తిరుగుబాటు జెండా ఎత్తారు. 'జై తెలంగాణ' అంటూ తొలికేక పెట్టారు. ప్రాంతీయ వివక్ష, ముల్కీ, నాన్‌ముల్కీ అంశంపై 1969 జనవరి 8న తెలంగాణ ముద్దుబిడ్డ అన్నాబత్తుల రవీంద్రనాథ్ ప్రత్యేక నినాదంతో జెండాను భుజానికెత్తుకున్నారు. ఖమ్మం గాంధీచౌక్‌లో అత్యంత ప్రజాస్వామ్య పద్ధతిలో ఆమరణ దీక్షకు పూనుకున్నారు. ఖమ్మానికే చెందిన సింగరేణి ఉద్యోగి కొలిశెట్టి రాందాసు, కైలాస్‌నాథ్, నిమ్మల శంకర్‌రావు, కవిరాజమూర్తి, కోలాహాలం వెంకటేశ్వరరావు, వీ రామస్వామి, అర్వపల్లి సుధాకర్, అర్వపల్లి విద్యాసాగర్ లాంటి సహచరులు వెన్నంటి ప్రోత్సహించగా అన్నాబత్తుల రవీంద్రనాథ్ ఒక్కరే.. జనవరి 8 నుంచి 22 వరకు దీక్షను కొనసాగించారు. ఆ పోరాటమే మహోత్తర తెలంగాణ ఉద్యమ సంగ్రామానికి నాంది పలికింది.

**మలిదశ ఉద్యమానికీ పురుడు పోసినం..**

నివురుగప్పిన నిప్పులా ఉన్న తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను ప్రొఫెసర్ జయశంకర్ సార్ చూపిన తొవ్వలో తెలంగాణ రాష్ట్ర సమితి (ఇప్పుడు బీఆర్ఎస్) అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు (కేసీఆర్) ప్రత్యేకరాష్ట్ర ఆకాంక్షను భుజానికెత్తుకున్నారు. 'కేసీఆర్ చచ్చుడో.. తెలంగాణ వచ్చుడో..' అనే నినాదంతో 2009 నవంబర్ 29న ఆమరణ దీక్షకు దిగారు. దీంతో గడగడలాడిన సీమాంధ్ర పాలకులు కేసీఆర్‌ను అదేరోజు అరెస్టు చేశారు. ఖమ్మంలో సమైక్యవాదం ఎక్కువగా ఉంటుందని, తెలంగాణ ఉద్యమంగా అంతగా ఉండదని భావించిన సీమాంధ్ర పాలకులు ఆయనను ఇక్కడికి తీసుకొచ్చారు. తద్వారా తెలంగాణ ఉద్యమాన్ని అణగదొక్కవచ్చని భావించారు. కానీ వారి భావన తప్పయింది. ఉద్యమసారథిని అరెస్టుచేసి ఖమ్మానికి తీసుకొస్తున్నారన్న విషయం తెలియగానే.. తెలంగాణ శక్తులన్నీ ఏకమయ్యాయి. ఆయనకు అండదండగా నిలిచి తెలంగాణ కాంక్షను చాటిచెప్పాయి.

**గుబాళించిన 'గులాబీ' దండు**

ప్రత్యేక రాష్ట్ర సాధన కోసమే పురుడుపోసుకున్న టీఆర్ఎస్ (ఇప్పుడు బీఆర్ఎస్).. ఖమ్మం పురిటిగడ్డపై అలుపెరగని పోరాటం చేసింది. సొంతంగా చెప్పుకోదగ్గ బలం లేకున్నా ప్రజల మద్దతును కూడగట్టి రాష్ట్ర సాధనలో తనదైన రీతిలో కొట్లాడింది. తెలంగాణ వాదానికి మద్దతు కూడగట్టింది. అడుగడునా సీమాంధ్ర నేతల విగ్రహాలున్న ఉమ్మడి ఖమ్మం జిల్లాలో తెలంగాణ తల్లి విగ్రహాలను నెలకొల్పింది. ఉద్యమ గుమ్మాన తెలంగాణ సంప్రదాయ పండుగైన బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించింది.

**పులకించిన పురిటిగడ్డ..**

రక్త తర్పణాలు, అక్రమ నిర్బంధాలు, అలుపెరుగని పోరాటాల ఫలితంగా 60 ఏళ్ల అనంతరం నాలుగున్నకోట్ల మంది తెలంగాణ ప్రజల స్వప్నం సాకారమమైంది. ఫలితంగా 2014 జూన్ 2న పోరాటాల పురిటిగడ్డ పులకించి పోయింది. దేశ రాజధాని సాక్షిగా దేశంలో 29వ రాష్ట్రంగా అవతరించింది. తల్లి తెలంగాణను తలుచుకొని సబ్బండ వర్ణాలూ ఆనంద భాష్పాలు రాల్చాయి. స్వేచ్ఛా వాయువులను పీల్చాయి. ఉమ్మడి జిల్లాలోని ప్రతి ఒక్కరూ ఒకరినొకరు గుండెలకు హత్తుకొని 'జయహో తెలంగాణ' అంటూ సెల్యూట్ చేశారు. నాటి నుంచి బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో ఏటా జూన్ 2న తెలంగాణ అవతరణ దినోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగాయి. కానీ కాంగ్రెస్ పాలనా పగ్గాలు చేపట్టిన ఈ ఏడాదిన్నరలో రెండుసార్లు తెలంగాణ అవతరణ దినోత్సవాలు జరిగాయి. అయినప్పటికీ ఉమ్మడి జిల్లా ప్రజలు స్వచ్ఛమైన ఉద్యమ మాధుర్యాన్ని తనివితీరా అనుభూతి చెందలేకపోతున్నారు.

# 5న మంత్రివర్గ సమావేశం

(మొదటి పేజి తరువాయి)

అధికారులతో సమీక్షలు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్రావిర్భావ వేడుకల ఏర్పాట్లతోపాటు ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల తుది జాబితాలు, రెవెన్యూ సదస్సుల నిర్వహణ, వాటి ఏర్పాట్లకు సంబంధించి జిల్లాల వారీగా తయారు చేసిన నివేదికలపై మంత్రులు సీఎంకు వివరించారు. రాజీవ్ యువ వికాసం పథకానికి ఊహించిన దానికంటే ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయని వారు తెలిపారు. అనర్హులకు ఈ పథకం అందకుండా చూడాలంటూ పెద్ద ఎత్తున ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు. అధిక సంఖ్యలో వచ్చిన దరఖాస్తుల స్క్రీనింగ్ ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో పూర్తి స్థాయి పరిశీలన తరువాతే అర్హుల జాబితాలను ప్రకటించాలని, మరింత లోతుగా విశ్లేషించి లబ్దిదారులను గుర్తించాలని సీఎం ఈ సందర్భంగా నిర్ణయించారు. అర్హులకే ఈ పథకం దక్కేలా చూడాలని ఆయన నొక్కిచెప్పారు. ఈ అంశంపై క్యాబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. ఉద్యోగుల సమస్యలపై నియమించిన కమిటీ రిపోర్టును అధికారులు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ఇప్పటికే సమర్పించారు. ఆ నివేదికలోని అంశాలను ఆయన సీఎంకు, మంత్రులకు వివరించారు. దీనిపై కూడా మంత్రివర్గంలో చర్చించి, నిర్ణయం తీసుకోనున్నారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నందుకు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని మంత్రులు ఈ సందర్భంగా అభినందించారు.

**ఆశలు, ఆకాంక్షలు నెరవేరుస్తాం : సీఎం రేవంత్**

రాష్ట్ర ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రైజింగ్ నినాదంతో రాష్ట్ర ఆర్థిక అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు. రాష్ట్రావిర్భావ దినోత్సవం సందర్భంగా సీఎం, ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. సరికొత్త విధానాలు, భవిష్యత్ ప్రణాళికలతో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలుపుతామని ఈ సందర్భంగా సీఎం పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న కవులు, కళాకారులు, ఉద్యమకారులు, ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# ఆపరేషన్ సిందూర్‌ను కూడా వదల్లేదు..

(మొదటి పేజి తరువాయి)

గట్టి గుణపాఠం చెప్పాలన్నారు. ఆపరేషన్ సిందూర్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బీజేపీ రాజకీయం చేస్తున్నాయని మమతాబెనర్జీ ఇటీవల ఆరోపించారు. జాతి భద్రతను నిర్ణయించే ఎన్నికలు కోల్‌కతాలోని నేతాజీ ఇండోర్ స్టేడియంలో బీజేపీ నేతలు, కార్యకర్తలను ఉద్దేశించి అమిత్‌షా ఆదివారం నాడు మాట్లాడుతూ, రాష్ట్రంలో రాబోయే ఎన్నికలు బెంగాల్ భవిష్యత్తును మాత్రమే కాకుండా జాతి భద్రతను నిర్ణయించే ఎన్నికలని అన్నారు. బంగ్లాదేశీయుల కోసం దేశ సరిహద్దులను మమతా బెనర్జీ తెరిచిపెట్టారని ఆరోపించారు. చొరబాటుదారులను రాష్ట్రంలోకి అనుమతిస్తున్నారని, వారిని అడ్డుకోవడం ఆమె వల్ల కాదని, ఒక్క బీజేపీ ప్రభుత్వం మాత్రమే ఆపని చేయగలదని చెప్పారు. సరిహద్దుల్లో బీఎస్ఎఫ్ ఆపరేషన్, కంచె కోసం భూములు కేటాయించమని అడిగినా ఆమె కేటాయించలేదని మండిపడ్డారు. అందువల్లే చొరబాట్లు కొనసాగుతున్నాయని ఆరోపించారు. 'అధికారం కోసం, ఓటు బ్యాంకు పెంచుకునేందుకు ఇవన్నీ చేస్తున్నారు. మీ తర్వాత మీ మేనల్లుడు సీఎం కావచ్చు. కానీ ఇదెంతమాత్రం కొనసాగనీయరాదు' అని అమిత్‌షా అన్నారు.

**2026లో వచ్చేది బీజేపీ ప్రభుత్వమే**

బెంగాల్‌లో ఏళ్ల తరబడి కమ్యూనిస్ట్ పాలన నడిచిందని, ఆ తర్వాత 'మా, మాటీ, మానుష్' నినాదంతో మమతాబెనర్జీ అధికారంలోకి వచ్చారన్నారు. అయితే ఆమె నాయకత్వంలో బంగ్లా చొరబాట్లు, మహిళలపై నేరాలు, నేరపూరిత ఘటనలు, బాంబు పేలుళ్ల ఘటనలు పెరిగాయని అమిత్‌షా ఆరోపించారు. మమతా బెనర్జీ పగ్గాలు చేపట్టాక వందలాది మంది బీజేపీ కార్యకర్తలు ప్రాణాలు కోల్పోయారని, దీదీని సాగనంపే సమయం వచ్చిందని అన్నారు. పశ్చిమ బెంగాల్ 2026 ఎన్నికల్లో ప్రభుత్వాన్ని బీజేపీ ఏర్పాటు చేస్తుందని అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు.

# స్వయంపాలన స్ఫూర్తి కొనసాగాలి

(మొదటి పేజి తరువాయి)

పార్లమెంటరీ పంథాలో కొట్లాడి స్వరాష్ట్రాన్ని సాధించుకున్నామని, ఉమ్మడి పాలనలో ఆగమైన తెలంగాణను స్వయం పాలనలో అభివృద్ధి చేసుకున్నామని పేర్కొన్నారు. సకలజనుల సంక్షేమాన్ని కొనసాగిస్తూ, సమస్త రంగాల్లో ప్రగతిని సాధిస్తూ, పదేండ్ల అనతికాలంలోనే తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలుపుకొన్నామని వివరించారు. అదే స్ఫూర్తిని కొనసాగిస్తూ అన్ని వర్గాల ప్రజల జీవన విధానం మరింత గుణాత్మకంగా సాగే దిశగా పాలనా ప్రాధాన్యతలను ఎంచుకొని అమలు చేయాలని సూచించారు. తెలంగాణ మరింత ప్రగతిని సాధిస్తూ, పాడి పంటలతో వర్ధిల్లుతూ, రైతులు, సబ్బండ కులాలు, సకలజనుల జీవితాలు సుఖ సంతోషాలతో నిండాలని ఆదివారం ఓ ప్రకటనలో ఆకాంక్షించారు.

# స్వీయ ప్రశంసలు ఆపాలి

(మొదటి పేజి తరువాయి)

సారించండి అని అన్నారు. తాను తప్ప మరెవరూ అలా చేయరని గొప్పలు చెప్పుకునే బదులు శత్రులపై దృష్టి పెట్టాలని, రాజకీయ విభేదాలకు అతీతంగా తాను చెబుతున్నానని అన్నారు. భారత సాయుధ దళాలకు కాంగ్రెస్ సంపూర్ణ మద్దతును పునరుద్ఘాటించారు. సైన్యానికి పూర్తి స్వేచ్ఛా ఇచ్చామని ప్రధాని గతంలో చేసిన వాఖ్యలను ఖర్గే విమర్శించారు. సాయుధ దళాలకు పూర్తి అధికారం ఇచ్చామని చెప్పే మోడీ, తానే అంతా చేశానని ఎందుకు చెప్పుకుంటున్నారని అన్నారు. గొప్పలు చెప్పకోవడం మంచిది కాదు అని అన్నారు. సున్నితమైన సమయాల్లో రాజకీయ సంయమనం అవసరం అని తెలిపారు. గతంలో భారత్-పాక్ ఉద్రిక్తతల సమయంలో పాకిస్తాన్ పార్లమెంట్‌లో చూపిన సంయమనాన్ని ఉదహరిస్తూ భారత్-పాక్ మధ్య ఘర్షణలు చెలరేగినప్పుడు, దేశానికి వ్యతిరేకంగా ఏమీ మాట్లాడకూడదని పాకిస్తాన్ పార్లమెంటులో చర్చ జరిగిందని అన్నారు. సైన్యం ఉన్నంత వరకు అందరూ క్షేమమేనని, అందుకే తాము సాయుధ దళాలకు మద్దతు ఇస్తాము అన్నారు.

# మస్క్‌కు ట్రంప్ షాక్

(మొదటి పేజి తరువాయి)

నామినీని ప్రకటిస్తానని, ఆయన అంతరిక్షంలో అమెరికాను అగ్రస్థానంలో నిలుపుతారని చెప్పారు. అమెరికా అంతరిక్ష సంస్థ నాసాకు తదుపరి అధినేతగా ఐసాక్‌మాన్‌ను ఎంపిక చేసుకున్నానని గత డిసెంబరులో అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన సమయంలో ట్రంప్ ప్రకటించారు. 42 సంవత్సరాల ఐసాక్‌మాన్‌కు మస్క్‌తో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. 2021లో మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్ కంపెనీ నుండి ఐసాక్‌మాన్ తన తొలి ఛార్టర్డ్ విమానాన్ని కొనుగోలు చేసినప్పటి నుండి వీరిద్దరి మధ్య సంబంధాలు బలపడ్డాయి. ఐసాక్‌మాన్ క్రెడిట్‌కార్డ్ ప్రాసెసింగ్ కంపెనీ షిఫ్ట్4కు సీఈఓగా, వ్యవస్థాపకుడిగా కొనసాగుతున్నారు. ఆయన స్పేస్‌ఎక్స్ నుండి అనేక అంతరిక్ష నౌకలను కొనుగోలు చేశారు. తొలిసారి ప్రైవేటుగా అంతరిక్షంలో నడిచారు. స్పేస్‌ఎక్స్ కంపెనీకి నాసాతో విస్తృత కాంట్రాక్టులు ఉన్నాయి. కాగా సెనెట్‌కు చెందిన వాణిజ్య, శాస్త్ర, రవాణా కమిటీ ఏప్రిల్‌లో ఐసాక్‌మాన్ నామినేషన్‌ను ఆమోదించింది. దీనిపై త్వరలోనే సెనెట్‌లో పూర్తి స్థాయి ఓటింగ్ జరగాల్సి ఉంది. ఈ లోగానే ట్రంప్ ఆయన నామినేషన్‌ను వెనక్కి తీసుకున్నారు. ట్రంప్ నిర్ణయంపై మస్క్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. 'ఇంతటి సమర్థుడు, మంచి మనసున్న మనిషి దొరకడం చాలా అరుదు' అని సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. మస్క్ ఇటీవలే ప్రభుత్వ సమర్థతా విభాగమైన డోజ్ నుండి తప్పుకున్న విషయం తెలిసిందే.

# పోలీసు సేవా పతకాలు ప్రకటించిన తెలంగాణ ప్రభుత్వం

(మొదటి పేజి తరువాయి)

16 మంది మహోన్నత సేవా పతకానికి అర్హులయ్యారు. శౌర్య పతకాన్ని అందుకున్నవారు తమ విధుల్లో అపూర్వ ధైర్యాన్ని ప్రదర్శించి ప్రజల రక్షణ కోసం ప్రాణాలను సైతం పణంగా పెట్టినవారుగా గుర్తింపు పొందారు. మహోన్నత సేవా పతకాన్ని అందుకున్న అధికారులు సుదీర్ఘ కాలంగా నిజాయితీ, నిబద్ధతతో సేవలందించారని పోలీసు శాఖ పేర్కొంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ప్రతి ఏడాది అవతరణ దినోత్సవం సందర్భంగా పోలీసు అధికారులకు ఈ సేవా పతకాలు ప్రదానం చేయడం పరంపరగా వస్తోంది.

# కేటీఆర్ యూకే పర్యటన సక్సెస్

(మొదటి పేజి తరువాయి)

ఆవిర్భావ వేడుకలు, బీఆర్ఎస్ రజతోత్సవాల్లో పాల్గొననున్నారు. లండన్‌లోని తెలంగాణ ప్రవాసులు, బీఆర్ఎస్ యూకే విభాగం నాయకులు, కార్యకర్తలు ఘనంగా వీడ్కోలు పలికారు. ఐదురోజుల పాటు ఇంగ్లండ్‌లో కేటీఆర్ అనేక ప్రతిష్ఠాత్మకమైన కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో సాధించిన ప్రగతిని గణాంకాలతో వివరించారు. బీఆర్ఎస్ ఎన్నారైలతో మమేకమయ్యారు. వారి సాధకబాధకాలను తెలుసుకున్నారు. ప్రత్యేక రాష్ట్ర పోరాటంలో వారి కీలకపాత్రను గుర్తుచేస్తూ అప్పటి అనుభూతులను పంచుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ తిరోగమన విధానాలను ఎండగట్టాలని సూచించారు.

**ఎన్నారై నేతలతో సమావేశం**

మే 27న యూకేలో అడుగుపెట్టిన కేటీఆర్‌ను వివిధ రంగాల ఎన్నారై ప్రముఖులు కలిశారు. కేటీఆర్ నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధి కోసం సాగుతున్న పోరాటానికి అడుగడుగునా అండగా ఉంటామని ప్రకటించారు. ఎయిర్‌పోర్టు నుంచి నేరుగా గుండె సంబంధ ఆపరేషన్ తర్వాత కోలుకుంటున్న బీఆర్ఎస్ ఎన్నారై నేత, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ అనిల్ కుర్మాచలం ఇంటికి వెళ్లి, ఆయన ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. అండగా ఉంటానని భరోసానిచ్చారు. 28న బీఆర్ఎస్ ఎన్నారై సెల్ కార్యవర్గ సభ్యులు, సీనియర్ నేతలతో లండన్‌లో కేటీఆర్ సమావేశమయ్యారు. పార్టీ పటిష్టతకు చేస్తున్న కృషిని అభినందించారు. భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. బీఆర్ఎస్ పదేండ్ల



పాలనలో తెలంగాణ బ్రాండ్ అంబాసిడర్లుగా వ్యవహరించారని ప్రశంసించారు. అక్కడి నేతల విజ్ఞప్తి మేరకు లండన్‌లో రజతోత్సవాలను నిర్వహించేందుకు సుముఖత వ్యక్తంచేశారు. అనంతరం యూకే తెలుగు బిజినెస్ కౌన్సిల్ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలతో భేటీ అయ్యారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని పిలుపునిచ్చారు.

**బ్రిడ్జ్ ఇండియా సదస్సులో కీలకోపన్యాసం..**

మే 30న బ్రిడ్జ్ ఇండియా వీక్-25 సదస్సులో కేటీఆర్ చేసిన కీలకోపన్యాసం దేశవిదేశాల ప్రతినిధులను ఆకట్టుకున్నది. సుస్థిరమైన ఆర్థికాభివృద్ధితో ప్రపంచానికి తెలంగాణ దిక్సూచిగా నిలిచిన తీరును తనదైన శైలిలో వివరించారు. సంపద సృష్టించి పేదలకు పంచేవిషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరించిన విధానాలను క్లుప్తంగా తెలియజెప్పారు. అనంతరం వార్విక్ యూనివర్సిటీలో మెక్‌లారెన్, ఆస్టన్ మార్టిన్, జాగ్వార్, ల్యాండ్ రోవర్ లాంటి దిగ్గజ సంస్థలకు రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సేవలు అందించే పీడీఎస్ఎల్ నాలెడ్జ్ సెంటర్‌ను ప్రారంభించారు. ప్రతిష్ఠాత్మక కంపెనీల్లో తెలంగాణ బిడ్డలు సేవలందించడం మనందరికీ గర్వకారణమని ప్రశంసించారు. బీఆర్ఎస్ సర్కారు అనుసరించిన అత్యుత్తమ పాలసీలతో పుణె, చెన్నయ్ తర్వాత హైదరాబాద్ ఆటోమోటివ్ హబ్‌గా మారిన తీరును వివరించారు. పెట్టుబడులు వెల్లువెత్తి తెలంగాణ యువతకు ఉపాధి అవకాశాలు లభించాలని ఆకాంక్షించారు. యూకే పర్యటన విజయవంతానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు. లండన్‌లో కార్యక్రమాలను ముగించుకున్న కేటీఆర్ అక్కడి నుంచి అమెరికాలోని డాలస్‌లో పార్టీ సోమవారం తెల్లవారుజామున (భారత కాలమానం ప్రకారం) నిర్వహించనున్న రజతోత్సవ సంబురాల సభకు బయల్దేరి వెళ్లారు.

## సంపాదకీయం

# ఆత్మ స్తుతి, మోడీ స్తుతి కోసమేనా మహానాడు?

ఆంధ్రప్రదేలో టిడిపి కూటమి అధికారంలోకి వచ్చాక జరిగిన తొలి మహానాడు సభ ముగిసింది. తిరుపతి మినహా గతంలో రాయలసీమలో మహానాడు జరగలేదు. కడప జిల్లాలో అంటే వై.యస్.రాజశేఖర్ రెడ్డి, జగన్ మోహన్ రెడ్డి అధికార పీఠంగా పరిగణించబడుతుంది కనుక అక్కడ మహానాడు నిర్వహించడమే ఒక రాజకీయ సంకేతం లాంటిది. అంగరంగ వైభవంగా భారీ ప్రచారంతో సాగిన ఈ మహానాడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఆయన కుమారుడు, మంత్రి లోకేష్ లకు అమితమైన సంతోషాన్ని ఇవ్వడంలో ఆశ్చర్యమేమీ లేదు. సభలు మొదలు కాకముందు నుంచే లోకేష్‌ను వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమిస్తారనే ప్రచారం మార్మోగింది. ఐదేళ్ల విరామంతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకోవస్తున్నది. కనుక 43 ఏళ్ల తెలుగుదేశం, నాలుగో దఫా పాలన తొలి ఏడాది పూర్తి చేసుకుంటున్న చంద్రబాబు భవిష్యత్ రాజకీయ గమనం ఎలా ఉంటుందనేది అందరి దృష్టిలో కీలకంగా ఉండింది. ఒకవైపు వైసిపి, మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అనుచరులపై వరుస కేసులు, అరెస్టులు సాగుతుండగా మరోవైపు కూటమిలో సర్దుబాట్లు, కేంద్రం సహాయం తీరుతెన్నులు, తెలుగుదేశంలో సీనియర్ జూనియర్ల మధ్య గడబిడలూ, ఆశావహుల అసంతృప్తులు ఇవన్నీ రంగం మీదకు వచ్చాయి. జగన్ ప్రభుత్వ తప్పిదాలపై తీవ్ర అసంతృప్తితో తమను గెలిపించిన ప్రజలకు ఎన్నికల సమయంలో చేసిన వాగ్దానాల అమలుపై మహానాడులో ఏం చెప్తారోనని సామాన్య జనం కూడా ఎదురుచూశారు.


### అతిశయాలతో ఆత్మ స్తుతి

అట్టహాసాలు, ఆర్భాటాలు చాలా ఉన్నా ఈ అన్ని విషయాల్లోనూ అస్పష్టతనే మిగిలిస్తూ మహానాడు ముగిసింది. రాష్ట్రానికి సంబంధించి గాని, తెలుగుదేశం అంతర్గత వ్యవహారాలకు సంబంధించి గాని నిర్మాణాత్మకంగా నిర్దిష్టంగా చెప్పింది దాదాపు లేదు. పైగా ఇది వ్యూహాత్మకంగా జరిగిందే తప్ప యాదృచ్ఛికం కాదు. అయినా మహానాడు మరునాడే చంద్రబాబు నాయుడు జాతీయ మీడియా లోనూ, సిఐఐ వంటి వేదికలపైనా చేసిన ప్రసంగాలలో ఏపీ బ్రాండ్ ఏదో మారిపోయి పెట్టుబడుల వరద ప్రవహిస్తున్నట్టు తాను అద్భుతమైన పథకాలను రూపకల్పన చేసినట్టు మాట్లాడటం దీనికి కొసమెరపు. ఎందుకంటే ఆయన చెబుతున్న వాటి నికర ఫలితాలు ఏవీ వచ్చింది లేదు. అసలు ఆ విధానాల పూర్తి స్వరూపం, కాల వ్యవధి నిర్దిష్ట రూపంలో అందుబాటులో లేవు. లోకేష్‌కు ప్రమోషన్ ఎప్పుడు ఎలా ఇస్తారన్నది పూర్తిగా తెలుగుదేశం పార్టీ అంతర్గత విషయమే. కావలసినంత ఎలివేషన్ అయిపోయిందని, డిక్లరేషన్ మాత్రమే మిగిలిందని టిడిపి ముఖ్యులే అంటున్నారు. చంద్రబాబు నాయుడుని మరోసారి రెండేళ్ల కాలానికి అధ్యక్షుడిగా ఎన్నుకోవడంతో ఒక ఘట్టం పూర్తయింది. మిగిలిన నియామకాలకు ఆయనే ముహూర్తం నిర్ణయించుకుంటారు. పదవులకు సంబంధించిన అంశాలు అలా ఉంచితే తెలుగుదేశం పార్టీ రాజకీయ విధానాలు, కూటమి ప్రభుత్వ పాలన విధానాలు మాత్రం ప్రజలందరికీ సంబంధించినవి. దేశాన్ని పాలించే ఎన్డీఏ కూటమికి ప్రధాన మద్దతుదారుగా ఉన్నందువల్ల జాతీయ రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాల మీద కూడా ఒక వైఖరి ప్రకటించాల్సిన బాధ్యత మహానాడుపై ఉండింది. కానీ ఆత్మ స్తుతి, మోడీ స్తుతి, ఆర్భాటపు ప్రకటనలు మినహాయిస్తే ఆ విధమైన రాజకీయ, పరిపాలనా నిర్దేశం ఏదీ కనిపించకపోవడం అతి పెద్ద లోపం. ఆర్థికంగా తీవ్ర లోటులో ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇచ్చిన భారీ హామీలు అమలు చేయగలిగిన స్థితిలో లేదు. అందుకోసం టిడిపి మోడీ ప్రభుత్వంపై ఒత్తిడి తేవడం అటు నుంచి కనీసం గట్టిగా అడిగే పరిస్థితిలో కూడా లేదు. ఇప్పటికే ఏడాదిలో లక్ష కోట్ల పైన అప్పులు చేశారన్న విమర్శలు మోగుతున్నాయి. తొలి ఏడాదిపై కాగ్ ఇచ్చిన నివేదిక చూస్తే 95 వేల కోట్లు ప్రభుత్వ వ్యయం లోటు కనిపిస్తుంది. వీటికి తోడు ఇంటి పన్ను, కరెంటు చార్జీలు మోత మోగిపోతున్నాయి. ఏపీ అంటే అమరావతి-పోలవరం అనే చంద్రబాబు ఇచ్చిన నిర్వచనంతో తేడాలు చాలా ఉన్నాయి కానీ వాటికి కూడా నిధుల కేటాయింపులు, పునరావాస ప్రణాళికలు ఏమాత్రం జరిగింది లేదు. పోలవరం 2027కు పూర్తి చేస్తామని మహానాడులో చంద్రబాబు హామీ ఇస్తున్నప్పుడు ఈ ప్రశ్నలు రాకుండా ఉండవు. అమరావతికి కేంద్రం సహకరించాలని విభజన చట్టంలో ఉన్నది. కానీ మోడీ సర్కారు ప్రపంచ బ్యాంకు అప్పు ఇప్పించటమే ఘనతగా చెప్పడం తప్ప ఆ హామీ అమలు చేయమని అడిగే ఆలోచన కూడా లేకపోయింది. కేంద్రం బాధ్యతగా ఉన్న రెండు కీలక అంశాల్లోనే ఇంత తడబాటు ఉంటే రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ఏదో సాధించి పెట్టడం ఊహకందని విషయం. అమరావతిలో అంతర్జాతీయ విమానాశ్రయం పేర మరో 45 వేల ఎకరాలు కావాలని ప్రకటించడం, అసలు రాజధానికే మరో పది వేల ఎకరాలు అవసరమవుతాయని చెప్పడం చూసి జనం నిర్ఘాంతపోతున్నారు. భోగాపురం ఎయిర్ పోర్టుకు కూడా మరింత భూమిని కేటాయించారు. ఉర్సా భూముల వ్యవహారాన్ని సమర్థించుకున్నారు.


### కేంద్రాన్ని అడగరా?

గత ఐదేళ్లు పాలించిన వైసిపి ఈ విషయంలో చూపిన నిర్లక్ష్యం అస్తవ్యస్త నిర్ణయాలు ఎంతైనా ఖండించవచ్చు. కానీ ఆ పేరుతో ప్రస్తుత కర్తవ్యాలను దాటవేయడం, కేంద్రం సహాయంపై ఒత్తిడి పెట్టకపోవడం ఎలా సమర్థనీయం? తమ సొంత కారణాల వల్ల మోడీతో తెలుగుదేశం పోట్లాడటం కష్టం అనుకుంటే అప్పుడు అఖిలపక్ష వేదికల నుంచి రాష్ట్రం తరఫున ఒత్తిడి తేవడం సరైన మార్గం. అది విభజిత రాష్ట్రం హక్కు కూడా. కానీ మూడు రోజుల మహానాడులో అంతా మేము చూసుకుంటామనే ఊకదంపుడుతోనే సరిపోయింది. తమను తాము పొగుడుకున్నది చాలక ఎన్టీఆర్ ఏఐ ఇమేజ్ తోనూ పొగిడించుకున్నారు. ఆయన వారసత్వం చూస్తే అయోధ్యకు అద్వానీ రథయాత్ర, బాబ్రీ మసీదు విధ్వంసం అనంతరం ఎన్టీఆర్ బిజెపిని పూర్తిగా దూరంపెట్టారు. కింగ్ మేకర్‌గా అభివర్ణించబడే చంద్రబాబు నాయుడు నిజానికి కింగ్‌బ్యాకర్‌గా మారి అప్పుడు వాజ్‌పేయిని, ఇప్పుడు మోడీని దేశం నెత్తిన రుద్దడానికి ప్రధాన కారకులయ్యారు. హరికిషన్ సింగ్ సూర్జిత్, జ్యోతి బసు, వి.పి సింగ్ వంటి ఉద్దండుల అండదండతో యునైటెడ్ ఫ్రంట్ కన్వీనర్ గా ఉన్నప్పుడు మాత్రమే ఆయన నిజమైన అర్థంలో కేంద్ర రాజకీయాలలో గౌరవప్రదమైన పాత్ర పోషించ గలిగారు. బిజెపి-ఎన్‌డిఎల దగ్గర ఆయనది వత్తాసు పలికే పాత్ర మాత్రమే. ఆయన మూడుసార్లు విజయం సాధించినప్పుడు బిజెపితో కలిసి ఉన్న మాట నిజమే కానీ రెండుసార్లు కూడా విడగొట్టుకోక తప్పలేదు. ఇప్పుడైనా పరిస్థితి అంతకంటే భిన్నంగా ఉండదు. పత్యేక హోదా, విశాఖ ఉక్కు పరిరక్షణ, అమరావతికి ఇతోధిక సాయం, పోలవరం సత్వర నిర్మాణం కోసం సహాయ పునరావాస నిధులు లాంటివి గట్టిగా అడిగితే తన అస్తిత్వానికే ముప్పు అని తెలుగుదేశం ఆందోళన పడుతున్నది

# మళ్లీ కరోనా!



విశ్వమంతా విషపూరితమైన యుద్ధోన్మాద గాలుల నడుమ ఊపిరి సలపనంత ఉద్వేగం వీస్తోంది. మన శ్వాసలో భయం మళ్లీ ఊపిరి పీలుస్తోంది. ఛిద్రమౌతున్న మానవ హక్కులు, ఆకలి కేకలు ఒకవైపు, కుల మతాల వర్ణ వివక్ష, యుద్ధ కాంక్ష ఇంకోవైపు, నిరుద్యోగం, పేదరికం, వాతావరణ కాలుష్యం వంటి అనేక రుగ్మతలు మానవాళిని చుట్టుముట్టి, ఊపిరి సలపనివ్వని విపత్కర పరిస్థితిలో 'మళ్లీ కరోనా' మహమ్మారి కోరలు చాస్తోంది. శతాబ్దాలుగా మానవజాతి మనుగడను ప్రశ్నించి, సవాల్ చేసిన మహమ్మారులు చరిత్ర పుటల్లో ఎన్నో వున్నాయి. సాంకేతికంగా ఎంతో పురోగతి సాధించిన ఈ కాలంలోనూ మానవాళిని వణికించింది కరోనా. ఇది మన సామాజిక, ఆర్థిక వ్యవస్థలను, వైద్య రంగాన్ని సవాల్ చేసిందంటే అతిశయోక్తి కాదు. 'ఒక మనిషిని నాశనం చేయవచ్చు, కానీ ఓడించలేరు' అంటారు 'ది ఓల్డ్ మ్యాన్ అండ్ ది సీ' నవల రచయిత ఎర్నెస్ట్ హెమింగ్వే. కరోనా మళ్లీ వచ్చిందని ఆందోళన పడేకంటే, గత అనుభవాల నుంచి నేర్చుకున్న పాఠాలతో పాటు, అప్రమత్తత, జాగ్రత్త, పరిశుభ్రత అనే ఆయుధాలతో దీన్ని ఎదుర్కోవాలి. 'చెవి పెట్టి విన్నావా ఎప్పుడైనా/ అదుపు తప్పిన మనిషి మనుగడలో/ మార్పు కోసం వచ్చిన కుదుపే కదా కరోనా' అంటాడో కవి. ఐదేళ్ల క్రితం ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనా వైరస్ మళ్లీ మెల్లగా విజృంభిస్తోంది. దేశవ్యాప్తంగా కరోనా కేసులు వెలుగు చూస్తున్నాయి. రాష్ట్రంలోనూ కరోనా కలకలం మొదలైంది. కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించిన వివరాల ప్రకారం.. దేశవ్యాప్తంగా యాక్టివ్ కేసుల సంఖ్య వెయ్యి దాటింది. ప్రస్తుతం నమోదవుతున్న కేసుల్లో అత్యధికంగా ఎన్‌బి.1.8.1, ఎల్ఎఫ్.7 వేరియంట్లు వున్నట్లు నిపుణులు గుర్తించారు. అయితే, గతంలో మాదిరిగా ఆక్సిజన్ లెవల్స్ పడిపోవడం, ఆయాసం, నీరసించిపోవడం వంటి లక్షణాలు ఇప్పుడు లేవు. 'ఈ వేరియంట్లు అంత ప్రమాదకరమైనవి కావని, అయినప్పటికీ అప్రమత్తంగా వుండాలని' నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయితే, కొత్తగా వచ్చే ఈ కరోనా తీవ్రమైనదో, సాధారణమైనదో ఇప్పుడే చెప్పలేము. గత కోవిడ్ సమయంలో వ్యాక్సిన్‌ల వల్ల సైడ్ ఎఫెక్ట్స్ వున్నాయని ఆస్ట్రాజెనెకాయే ఒప్పుకోవడంతో, కోవిషీల్డ్ వ్యాక్సిన్ వేయించుకున్న వారు కేసులు వేసిన సంగతి తెలిసిందే. ఫార్మా కంపెనీలు, ప్రభుత్వాలు కుమ్మక్కై ప్రజాధనం దోచేశారనే వార్తలూ వచ్చాయి. ఈ క్రమంలో మళ్లీ కరోనా విజృంభిస్తోందన్న వార్తలు ప్రజల్ని ఆందోళనకు గురిచేస్తున్నాయి. గత రెండు వేవ్‌లలో సాగిన మహోత్పాతం పీడకలగా వెంటాడుతున్న తరుణంలో రోగ విస్తృతి, ప్రభావం, నివారణ వంటి విషయంలో ప్రభుత్వాలు ఎలాంటి దాపరికం లేకుండా ప్రజలకు భరోసా యివ్వాలి.



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

'అంధకారాన్ని చూస్తే భయమేస్తుంది, వెలుతురుని చూస్తే ఆశ నిండుతుంది' అంటారో రచయిత. రెండు వేవ్‌ల నుంచి పొందిన గుణపాఠం.. ఒక అనుభవంగా మన ముందు నిలిచే వుంది. మళ్లీ కరోనా వచ్చిందని భయపడేకంటే అప్రమత్తత, సంకల్ప బలంతో మరోసారి కరోనాపై విజయం సాధించడానికి సంసిద్ధులు కావాలి. 'ఘోరమైన కష్టాలు మనల్ని మలుపు తిప్పుతాయి, కానీ వాటిని అధిగమించే మన ధైర్యమే మన నిజమైన బలం' అంటారు 'గాన్ విత్ ది విండ్' నవలా రచయిత్రి మార్గరెట్ మిచెల్. ఒకానొక కాలంలో ప్రాణాంతకమైన వ్యాధిగా పరిగణింపబడి, ఎన్నో ప్రాణాలను బలితీసుకున్న కలరా నిర్మూలన జ్ఞాపకాలను తన మూలాల్లో నిలుపుకొని, సజీవ చిత్రంగా మన ముందు నిలిచిన చార్మినార్ లాగే, రెండు వేవ్‌లలోనూ ప్రాణాలను బలిగొన్న కరోనా జ్ఞాపకాలు, ఈ నేలపై పచ్చబొట్టుగా ముద్రితమైన నెత్తుటి పాదాల గురుతులు ఇంకా పచ్చిగానే వున్నాయి. మట్టి చరిత్ర ఆనవాళ్ల సాక్షిగా, మనిషి ఎన్ని భయోత్పాతాలను అధిగమించలేదూ , ఎన్ని ప్రాణాంతక వ్యాధుల గొలుసుకట్టు తెంపలేదు. ఒక వేదన నుంచి, ఒక ఉత్పాతం నుంచి ఉదయించిన వేకువగా వజ్ర సంకల్పంతో మనిషి నిలబడాలి. జీవితంలో ఎదురయ్యే ప్రతి విపత్తూ మనం ఎలా స్పందించామనే దానిపైనే ఆధారపడి వుంటుంది. ప్రగతికి నూతన వారధి నిర్మిస్తూ, అన్ని రంగాల్లోనూ దూసుకుపోతున్న మనిషి%ా% కరోనాకు చరమగీతం పాడటంలోనూ అప్రమత్తుడేనని నిరూపించాల్సిన సమయం ఇది.

## రష్యా ఎయిర్‌బేస్‌పై

# ఉక్రెయిన్ దాడి

### -40కు పైగా యుద్ధ విమానాలు ధ్వంసం



**మాస్కో -01 ప్రజా స్వేచ్ఛ**

రష్యా ఎయిర్‌బేస్‌పై ఉక్రెయిన్ దాడి చేసింది. భారీ డ్రోన్ల దాడిలో 40కు పైగా రష్యా యుద్ధ విమానాలు ధ్వంసమైనట్లు ఉక్రెయిన్ దేశీయ భద్రతా సంస్థ అధికారులు తెలిపారు. (Russian air crafts downed) అయితే రష్యా దీనిపై స్పందించలేదు. ఆదివారం రష్యాలోని ముర్మాన్స్క్ ప్రాంతంలో ఉన్న కీలకమైన ఒలెన్యా వైమానిక స్థావరంపై ఉక్రెయిన్ డ్రోన్లతో దాడి చేసింది. టీయూ-95, టీయూ-22 వంటి వ్యూహాత్మక బాంబర్లతో సహా 40కు పైగా రష్యా యుద్ధ విమానాలు ధ్వంసమైనట్లు సెక్యూరిటీ సర్వీస్ ఆఫ్ ఉక్రెయిన్ (ఎస్‌బీయూ) అధికారులు తెలిపారు. రష్యా ఎయిర్‌బేస్ నుంచి దట్టంగా ఎగిసిన పొగలు, వార్ ప్లేన్స్ ధ్వంసమైన ఫొటోలు, వీడియో క్లిప్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.కాగా, రష్యాకు చెందిన కీలకమైన వ్యూహాత్మక ఎయిర్ బేస్‌లలో ఒలెన్యా ఒకటి. అణ్వాయుధాలను మోసుకెళ్లగల యుద్ధ విమానాలను ఇక్కడ మోహరించినట్లు తెలుస్తున్నది. అయితే తమ ఎయిర్‌బేస్‌పై ఉక్రెయిన్ దాడిని రష్యా ఇంకా ధృవీకరించలేదు. ఈ దాడిలో ఎంత ప్రాణ నష్టం జరిగిందో అన్నది కూడా తెలియలేదు.

# పోలీస్ సేవ పతకాలు ప్రకటించిన తెలంగాణ ప్రభుత్వం

**హైదరాబాద్: ప్రజా స్వేచ్ఛ**

తెలంగాణ ప్రభుత్వం పోలీస్ సేవ పథకాలను ప్రకటించింది, రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పోలీస్ సేవ పథకాలను ప్రకటిస్తూ హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవి గుప్తా, ఉత్తర్వులు జారీ చేసారు.. మొత్తం పోలీస్ శాఖలో వివిధ విభాగాల్లో పనిచేసిన మొత్తం 625 మందికి పథకాలు లభించాయి. అందులో గ్రేహౌండ్స్‌కు చెందిన 9 మందికి శౌర్య పతకం దక్కింది. 16 మంది మహోన్నత సేవా పతకం, 92 మంది ఉత్తమ సేవా పతకానికి అర్హులయ్యారు. అలాగే 47 మందికి కఠిన సేవా పతకం, 461 మంది సేవా పతకానికి ఎంపిక అయ్యారు. అదేవిధంగా అవినీతి నిరోధక శాఖలో ఒకరికి మహోన్నత సేవా, నలుగురికి ఉన్నత సేవా, 17 మందికి సేవా పతకాలు లభించాయి. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖలో ఒకరికి ఉత్తమ సేవా, ఐదుగురికి సేవా పతకాలు వరించాయి. స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్‌లో ఒకరికి మహోన్నత సేవా, ముగ్గురికి ఉత్తమ సేవా, 15 మందికి సేవా పతకాలను వచ్చాయి. డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఫైర్ సర్వీస్ శాఖలో ఇద్దరికి శౌర్య పతకం, ఒకరికి మహోన్నత పతకం, ముగ్గురికి ఉత్తమ సేవా, 14 మందికి సేవా పతకాలు లభించాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ప్రతి ఏడాది అవతరణ దినోత్సవం సందర్భంగా పోలీసు అధికారులకు సేవా పతకాలు ప్రధానం చేస్తున్న విషయం పాఠకులకు తెలిసిందే.



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

# ఫ్రాన్స్‌లో హింసాకాండ

-ఫుట్‌బాల్ అభిమానుల సంబురాల్లో ఘర్షణ..
-ఇద్దరు మృతి.. 200మందికి పైగా గాయాలు

**పారిస్ ప్రజా స్వేచ్ఛ**

ఫుట్‌బాల్ అభిమానుల మధ్య ఘర్షణలు ఉద్రిక్తతకు దారి తీయడంతో ఆదివారం పారిస్ వీధులు హింసాత్మకంగా మారాయి. ఈ హింసా కాండలో ఇద్దరు మరణించగా, 21మంది పోలీస్ అధికారులు సహా 200 మంది గాయపడ్డారని పోలీసులన్నారు. పారిస్‌లో సుమారు 491మందిని అరెస్ట్ చేయ గా, ఫ్రాన్స్ వ్యాప్తంగా మొత్తం 559 మందిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు.

### ఏం జరిగింది..?

ఛాంపియన్స్ లీగ్ ఫైనల్‌లో పారిస్ సెయింట్- జర్మైన్ (పీఎస్‌జీ) జట్టు, ఇంటర్ మిలన్ జట్టుపై 5-0 స్కోరుతో విజయం సాధించింది. బిగ్‌స్క్రీన్స్‌తో పాటు ప్రత్యక్షంగా ఈ మ్యాచ్‌ను చూసేందుకు సుమారు యాభైవేల మంది అభిమానులు పారిస్‌లోని చాంప్స్ -ఎలిసీస్ అవెన్యూ, పీఎస్‌జీకి చెందిన పార్క్ డెస్ ప్రిన్సెస్ స్టేడియానికి చేరుకున్నారు. పీఎస్‌జీ విజయం సాధించడంతో అభిమానులు పెద్దఎత్తున బాణాసంచా కాల్చారు. ఇదే సమయంలో ఇంటర్ మిలన్ జట్టు అభిమానుల మధ్య ఘర్షణలు చెలరేగాయి. ఈ ఘర్షణలు హింసాకాండకు దారితీశాయని అధికారులు తెలిపారు. పారిస్ వీధుల్లో మొదలైన వేడుకలు హింసాత్మకంగా మారడంతో భద్రతాదళాలు రంగంలోకి దిగాయి. ఆందోళనకారులను చెదరగొట్టేందుకు భాష్ప వాయువు ప్రయోగించారు. రెచ్చిపోయిన ఆందోళనకారులు భద్రతా దళాలపై దాడులకు దిగారు. బస్‌షెల్టర్లను ధ్వంసం చేయడంతో పాటు 200కి పైగా వాహనాలకు నిప్పుపెట్టారని ఫ్రాన్స్ అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆదివారం ప్రకటించింది.



# కొత్తగా 27 లక్షల మందికి రేషన్..

## పదేండ్ల పెండింగ్ అప్లికేషన్లకు కాంగ్రెస్ సర్కారులో మోక్షం..!!

-2.83 కోట్ల నుంచి 3.10 కోట్లకు లబ్ధిదారులు
-మరో 2 లక్షల కొత్త రేషన్కార్డులకు గ్రీన్ సిగ్నల్
-రాష్ట్రంలో 91.83 లక్షలకు చేరిన రేషన్కార్డులు



**హైదరాబాద్, ప్రజా స్వేచ్ఛ**
రాష్ట్రంలో రేషన్ లబ్ధిదారుల సంఖ్య గణనీయంగా పెరిగింది. గతంలో 2.83 కోట్ల మంది లబ్ధిదారులు ఉండగా.. తాజాగా వారి సంఖ్య 3.10 కోట్లకు చేరింది. కాంగ్రెస్ సర్కారు హయాంలో రేషన్ లబ్ధి దారుల ఎంపిక కోసం చేపట్టిన ప్రక్రియ ద్వారా కేవలం మూడు నెలల కాలంలోనే 27లక్షల మందికి పైగా కొత్తగా అర్హత సాధించారు.
అదే విధంగా రేషన్ కార్డులు గతంలో కంటే మరో 2లక్షలు పెరిగాయి. దీంతో రాష్ట్రంలో కార్డుల సంఖ్య 91.83 లక్షలకు చేరింది. జూన్ నెలలోనే ఒకే దఫాలో మూడు నెలలకు సంబంధించిన 18 కిలోల సన్నబియ్యం ఒక్కో రేషన్లబ్ధిదారుకు అందనున్నాయి. దీంతో కొత్త లబ్ధిదారుల్లో నూతనోత్సాహం నెలకొంది.

**పెండింగ్ దరఖాస్తులు క్లియర్**
గత ప్రభుత్వం పెండింగ్లో పెట్టిన లక్షలాది అప్లికేషన్లను సైతం ప్రజా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్లపాటు కొత్త రేషన్ కార్డుల ఎంపికను నిర్లక్ష్యం చేయడంతో దరఖాస్తులు భారీగా పేరుకుపోయాయి. దీంతో కాంగ్రెస్ సర్కారు మార్పులు చేర్పులకు సంబంధించి పెండింగ్లో ఉన్న దాదాపు 20 లక్షల అప్లికేషన్లపై ఫీల్డ్ లేవల్లో వెరిఫికేషన్ చేపట్టింది.
వెరిఫికేషన్ పూర్తి చేసుకుని అప్రూవల్ అయిన అప్లికేషన్లలో మార్పులకు చేర్పులకు సంబంధించి 18లక్షల మంది లబ్ధిదారులకు కొత్తగా రేషన్కు అర్హత సాధించారు. పెండింగ్ దరఖాస్తుల్లో 90శాతం



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

మందికి లబ్ధి జరిగింది. దీంతో గత ఎన్నో ఏండ్లుగా పెండింగ్లో ఉన్న అప్లికేషన్లకు మోక్షం లభించినట్లయింది. ఇది కొత్త ప్రజా ప్రభుత్వం సాధించిన ఘనత అని సివిల్ సప్లయ్స్ వర్గాలు చెబుతున్నాయి.

**కొత్తగా మరో 2 లక్షల కార్డులు**
కొత్త రేషన్ కార్డుల కోసం ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రజా పాలన ద్వారా గ్రామసభలు, మండల కార్యాలయాలు, ఎంపీడీవో కార్యాలయాల ద్వారా లక్షలాది మంది దరఖాస్తు చేసుకున్నారు. అదే విధంగా ఆన్లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులతో పాటు గత ఫిబ్రవరి 17 నుంచి మీ సేవ ద్వారా వచ్చిన లక్షలాది అప్లికేషన్లను వెరిఫికేషన్ చేసి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ నిర్వహించింది. అదే విధంగా కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న అప్లికేషన్లలో ఇప్పటి వరకు 2లక్షల అప్లికేషన్లకు అప్రూవల్ ఇవ్వడంతో రేషన్ కార్డులకు ఆమోదం లభించింది. ఈ కార్డుల కింద మరో 9 లక్షల మంది లబ్ధిదారులకు రేషన్ లబ్ధి చేకూరినట్లయింది. మిగతా అప్లికేషన్ల వెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. కొత్తగా దరఖాస్తు చేసుకునే వారికి సైతం వెరిఫికేషన్ నిర్వహించి రేషన్ అందేలా చర్యలు చేపడతామని సివిల్ సప్లయ్స్ అధికారులు చెబుతున్నారు.

# నేడు తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం

-మలిదశ ఉద్యమంలోనూ మడమతిప్పని పోరాటం
-ఉద్యమానికి ఊపిరిలూదిన ఉమ్మడి జిల్లా పోరుబిడ్డలు
-వలసవాదుల దోపిడీపై గర్జించిన ఉద్యమ గుమ్మం

తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

**ఖమ్మం, ప్రజా స్వేచ్ఛ**
'మా నిధులు మాకే.. మా ఉద్యోగాలు మాకే..' అనే నినాదంతో తెలంగాణ ఆకాంక్ష తొలికేకను ప్రతిధ్వనించింది ఉమ్మడి ఖమ్మం జిల్లా. వలసవాదుల దోపిడీకి వ్యతిరేకంగా గొంతెత్తి గర్జించింది. సీమాంధ్ర పాలకవర్గాల ప్రాంతీయ వివక్షపై పిడికెళ్లెత్తింది. నాలుగున్నర కోట్ల ఆకాంక్షకు పురుడు పోసింది. తొలి దశ, మలి దశ ఉద్యమాల్లో మడమతిప్పని పోరాట పటిమను ప్రదర్శించింది ఉద్యమ ఖిల్లా. అమరుల త్యాగాలను గుండెలకత్తుకున్న ఖమ్మం మెట్టు.. స్వరాష్ట్ర సాధనలో అలుపెరగని పోరు చేసింది. తెలంగాణ ఉద్యమ చరిత్ర పుటల్లో చిరస్థాయిగా నిలిచింది.
సీమాంధ్ర పాలకుల వివక్షకు, వలసవాదుల దోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమాల ఖిల్లా ఖమ్మం జిలా 'జై తెలంగాణ' అంటూ తొలికేక పెట్టింది. నిధులు, నీళ్లు, నియామకాల్లో వివక్షను తట్టుకోలేక 1969లోనే 'జై తెలంగాణ' అంటూ గర్జించింది. స్వరాష్ట్రం, స్వపరిపాలన కోరుతూ ప్రత్యేక రాష్ట్రం నినాదానికి పురుడుపోసింది. ఈ క్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ఎందరో ముద్దుబిడ్డలు రక్త తర్పణం చేశారు. వీరుల త్యాగాలను పుణికిపుచ్చుకున్న పురిటిగడ్డ పోరుబిడ్డలు.. మలిదశ ఉద్యమంలోనూ మడమతిప్పలేదు. విద్యార్థులు, మేధావులు, కార్మికులు, కర్షకులు, ఉద్యమ పార్టీల నేతలు, కార్యకర్తలు నాటి పోలీసుల నిర్బంధాలను లెక్కచేయలేదు.
ఉద్యోగులు కూడా సీమాంధ్ర పాలకుల బెదిరింపులను పక్కన పెట్టి.. భావితరాల కోసం జీవితాలనే (కొలువులనే) పణంగా పెట్టి అలుపెరగని ఉద్యమాలు చేశారు. ఉద్యమ సారథి కేసీఆర్ కూడా ఆమరణ దీక్షకు పూనుకున్నారు. తెలంగాణలోని సబ్బండ వర్గాలూ ఆయనకు వెన్నుదన్నుగా నిలిచాయి. ఫలితంగా చివరకు పార్లమెంటు సాక్షిగా తెలంగాణ బిల్లు ఆమోద ముద్ర వేసుకుంది. 2014 జూన్ 2న స్వేచ్ఛావాయువులతో స్వరాష్ట్రం అవతరించింది. పోరాటాల పురిటిగడ్డ పులకించిపోయింది.

**తెలంగాణ తొలికేక ఖమ్మానిదే..**






తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారసత్వంతో విప్లవ భావజాలాన్ని పుణికి పుచ్చుకున్న ఖమ్మం బిడ్డలు.. ఉద్యోగాల్లో జరుగుతున్న అన్యాయంపై తిరుగుబాటు జెండా ఎత్తారు. 'జై తెలంగాణ' అంటూ తొలికేక పెట్టారు. ప్రాంతీయ వివక్ష, ముల్కీ, నాన్ముల్కీ అంశంపై 1969 జనవరి 8న తెలంగాణ ముద్దుబిడ్డ అన్నాబత్తుల రవీంద్రనాథ్ ప్రత్యేక నినాదంతో జెండాను భుజానికెత్తుకున్నారు.
ఖమ్మం గాంధీచౌక్లో అత్యంత ప్రజాస్వామ్య పద్ధతిలో ఆమరణ దీక్షకు పూనుకున్నారు. ఖమ్మానికే చెందిన సింగరేణి ఉద్యోగి కొలిశెట్టి రాందాసు, కైలాస్నాథ్, నిమ్మల శంకర్రావు, కవిరాజమూర్తి, కోలాహాలం వెంకటేశ్వరరావు, వీ రామస్వామి, అర్వపల్లి సుధాకర్, అర్వపల్లి విద్యాసాగర్ లాంటి సహచరులు వెన్నంటి ప్రోత్సహించగా అన్నాబత్తుల రవీంద్రనాథ్ ఒక్కరే.. జనవరి 8 నుంచి 22 వరకు దీక్షను కొనసాగించారు. ఆ పోరాటమే మహోత్తర తెలంగాణ ఉద్యమ సంగ్రామానికి నాంది పలికింది.

# సమాజ సేవ చేయడం మా ప్రయాణం

నేలతల్లి, వ్యవస్థాపకులు చంటి



**కద్తాల్, ప్రజా స్వేచ్ఛ**
8వ తరగతిలో ఉన్నప్పుడు జూన్ 1న నేలతల్లితో నాప్రయాణం ప్రారంభమైంది. 8 సంవత్సరాల పూర్తి చేసుకున్న సందర్భంగా నేలతల్లి సభ్యులు జయేంద్ర ముఖేష్ సిద్దు రాజేజ్, సుఫియాన్, స్వాత్విక, హరణి, హర్షవర్ధని, అందరూ కలిసి భవిష్యత్తు పలు సేవా కార్యక్రమా లు చేయాలని వారు నిర్ణయించారు. ఒక వ్యక్తి నుండి నేడు 1500 మంది సభ్యులతో కలిసి అనేక సేవ కార్యక్రమాలు, కొనసాగిస్తున్న చంటి తెలిపారు. పర్యావరణాన్ని కాపాడేందుకు మొక్కలు నాటడం, పేదవారికి అనాధలకు, వృద్ధులకు, ఆహారం అందించడం, పర్యావరణ కాపాడుకోవడం మన అందరి బాధ్యతని వారన్నారు. ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టాలి పర్యావరణాన్ని పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు నడుం బిగించాలని చంటి తెలిపారు. జరిగింది అని చంటి తెలిపారు. మేము చేసే పలు సేవా కార్యక్రమాలకు సాయి సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల అదనపు కలెక్టర్గా భాస్కర్ రావు



**యాదాద్రి- ప్రజా స్వేచ్ఛ**
యాదాద్రి భువనగిరి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్గా భాస్కర్ రావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్గా బాధ్యతలు నిర్వహించిన గంగాధర్ రెండు నెలల క్రితం హెచ్ఎండీఏ కార్యదర్శిగా బదిలీ అవ్వగా అప్పటి నుంచి రెవెన్యూ కలెక్టర్ వీరారెడ్డి అదనపు బాధ్యతలను నిర్వహించారు. భాస్కరరావు గతంలో యాదాద్రి భువనగిరి జిల్లాలో భువనగిరి ఆర్డీవోగా, జిల్లా అదనపు రెవెన్యూ కలెక్టర్గా, యాదగిరిగుట్ట ఆలయ ఈవోగా పనిచేశారు.

# ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు

**గండీడ్- ప్రజా స్వేచ్ఛ**
మహబూబ్ నగర్ జిల్లా గండీడ్ మండలం ఇల్లు లేని నిరుపేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడం జరుగుతుందని గండీడ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జితేందర్ రెడ్డి ఆదివారం గండీడ్ అంచన్ పల్లి గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ళకి ముగ్గు వేసి ఇంటి నిర్మాణానికి



భూమి పూజ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇడ్లను అందజేస్తుందని కాంగ్రెస్ అంటేనే పేదల ప్రభుత్వమని గతంలో కాంగ్రెస్ ఉన్నప్పుడు ఇందిరమ్మ ఇల్లు ఎందరో పేదలకు నిర్మించి ఇచ్చామని తెలిపారు. కార్యక్రమంలో. గండీడ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జితేందర్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, గండీడ్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి, వెన్నాచెడు మాజీ సర్పంచ్ పుల్లారెడ్డి, మాజీ ఎంపిటిసి బాలయ్య, చెన్నారెడ్డి నరసింహారెడ్డి, భగవంత రెడ్డి, సుదర్శన్ రావు మధు గౌడ్ వెంకన్న గౌడ్, చెన్నప్ప, వెంకటేష్, కార్యదర్శులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# స్నేహితుడి కుటుంబానికి రూ.70 వేలు ఆర్థిక సాయం



**మేడ్చల్ ప్రజా స్వేచ్ఛ**
చదువుకోవడం, ఆడుకోవడం చిన్ననాటి మధురస్మృతులు నెమరువేసుకోవడమే కాదు అవసరకాలంలో అండగా నిలివడమే నిజమైన స్నేహం అని ఆ విద్యార్థులు నిరూపించారు. శామీర్పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1999-2000వ విద్యా సంవత్సరం 10వ తరగతికి చెందిన మహిపాల్రెడ్డి అకాల మృతిచెందాడు. విషయం తెలుసుకున్న తన చిన్ననాటి స్నేహితులైన క్లాస్మెట్స్ మహిపాల్రెడ్డి కుటుంబానికి అండగా నిలిచారు. రూ.70 వేలు అందజేసి ఆర్థిక తోడ్పాటునందించారు. భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు వచ్చిన తాము ఉన్నామనే భరోసా కల్పించారు.

# చిన్న రాష్ట్రాల ఏర్పాటుతో దేశం వేగంగా అభివృద్ధి చెందుతుంది

-అందుకే ఆర్టికల్ 3 ను రాజ్యాంగంలో పొందుపర్చిన డా.బి.ఆర్.అంబేద్కర్
-ఈ ఆలోచన ఆధారంగానే తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది
-చిన్న రాష్ట్రాలు దేశ అభివృద్ధికి దోహదం చేస్తాయి : అరుణ్ కుమార్





ప్రజా స్వేచ్ఛ ఘట్కేసర్ ప్రతినిధి

ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని ప్రజలు తీసుకెళ్లడానికి 216వవారం నిత్య పూలమాల కార్యక్రమం నిర్వహించబడింది ముఖ్యఅతిథిగా ఏరోలా శ్రీనివాస్ జాతీయ వాలీబాల్ కోచ్ & మాజీ వార్డ్ సభ్యుడు,ఎదులాబాద్ విచ్చేసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు.శ్రీనివాస్ మట్లాడుతు ఈ కార్యక్రమ నిర్వాహకులను అభినందిస్తూ, అంబెడ్కర్ చేసిన ఉద్యమాలు మరియు భారత రాజ్యాంగ విషష్ఠతను వివరించారు ప్రపంచ దేశాలలో ఎక్కడ లేని స్వేచ్ఛ,సమానత్వం,సౌభ్రాతృత్వం కూడిన రాజ్యాంగాని భారతదేశ ప్రజలకి ఇచ్చిన ఘనత బాబాసాహెబ్ అంబెడ్కర్ కి మాత్రమే చెందుతుంది అని అన్నారు బడుగు బలహీన అట్టడుగు వర్గాల కోసం అయన చేసిన కృషిని గుర్తుచేస్తూ అంబెడ్కర్ నుంచి యువకుల స్ఫూర్తిని పొంది గ్రామ గ్రామాన అజ్ఞానం వీడి జ్ఞానం వైపు నడవాలని పిలుపునిచ్చారు.తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అంబెడ్కర్ ముందు చూపుతోనే జరిగింది, చిన్న చిన్న రాష్ట్రాలతో భారత దేశం అభివృద్ధి చెంతుతుంది అని చేపిన అంబెడ్కర్ దూరదృష్టి తో ఆర్టికల్ 3 రూపొందించారు,అసెంబ్లీ రాజ్యాంగ చర్చలో అందరు రాష్ట్రాల హక్కులు ఆయా రాష్ట్రాల శాసనసభకి కూడా ఇవ్వాలని తీర్మానించారు,కానీ అంబెడ్కర్ రాష్ట్రాల హక్కులు ఆయా రాష్ట్రలో శాసన సభలకి ఇస్తే ఆ రాష్ట్రము లో ఉన్న మెజారిటీ వర్గంగా ఉన్న ప్రజల మాత్రమే దాని అంగీకరిస్తారు కానీ మైనారిటీ ప్రజలుగా ఉన్న ప్రజలా హక్కులు కాలరాస్తారు అని చెప్పారు.అప్పుడు అంబెడ్కర్ వాదన తో అందరు ఏకీభవించి,అసెంబ్లీ రాజ్యాంగ చర్చలో చిన్న రాష్ట్రాల ఎర్పాటు హక్కులు పార్లమెంట్ కి అధికారాలు ఇస్తూ ఆర్టికల్ 3 రూపొందించారు.ఆ రోజు అంబెడ్కర్ చేసిన ముందు చూపుతోనే ఈ రోజు తెలంగాణ కళ సాకారమైంది అని యమ్.అరుణ్ కుమార్ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా సమన్వయకర్త అన్నారు.ఈరోజు సూక్తి లలిత్ చెప్పారు,నీకోసం జీవిస్తే నీలోనే జీవిస్తావు,జనం కోసం జీవిస్తే జనం లో నిల్చిపోతావు అని అంబెడ్కర్ మాటలు గుర్తు చేసారు.ఈ కార్యక్రమంలో మేకల దాస్ అధ్యక్షుడు,అంబెడ్కర్ యువజన సంఘం,ఘట్‌కేసర్ మున్సిపాలిటీ కట్కూరి నర్సింగరావు అధ్యక్షుడు,గంగపుత్ర సంఘం, ఘట్‌కేసర్ మున్సిపాలిటీ రాందాస్ అధ్యక్షుడు,అంబెడ్కర్ యువజన సంఘం,ఈ డబ్లూ ఎస్ కాలనీ కె సత్యం,బి నాగరాజ్,గంగారాం ఆంజనేయులు,టి శ్రీరామ్, బాలనగరం గణేష్ గౌడ్,కృష్ణం రాజు,సి నిఖిల్,ఈ విష్ణు, అఖిల్,వివేక్,యాకేష్,లలిత్ తదితరులు పాల్గొన్నారు.

# హాఫీజ్ పేట్ డివిజన్ బీజేపీ నూతన కార్యవర్గం ఎన్నిక

కైతాపురం జితేందర్ బీజేపీ అధ్యక్షులు హాఫీజ్ పేట్ డివిజన్





ప్రజా స్వేచ్ఛ శేరి లింగంపల్లి ప్రతినిధి

మియాపూర్ లో భారతీయ జనతా పార్టీ హాఫీజ్ పేట్ డివిజన్ అధ్యక్షులు కైతాపురం జితేందర్ ఆధ్వర్యంలో కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది ఈ సమావేశంలో హాఫీజ్ పేట్ డివిజన్ బీజేపీ నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు మరియు రానున్న రోజుల్లో నిర్వహించవలసిన ఇతర కార్యక్రమాలపై సమావేశం నిర్వహించారు,హాఫీజ్ పేట్ డివిజన్ బీజేపీ నూతన కార్యవర్గంలో నియమితులైన నాయకులకు నియామక పత్రాలు ఇవ్వడం జరిగింది,హాఫీజ్ పేట్ డివిజన్ బీజేపీ ఉపాధ్యక్షులుగా యమ్.వెంకటేశ్వర్లు, టీ.శివాజీ,టీ.ప్రసాద్ పాత్రో,శివ ముదిరాజ్,ప్రధాన కార్యదర్శిలుగాఎన్. జగదీశ్వర్ గౌడ్, వీ.రాజు ముదిరాజ్, కార్యదర్శులుగా పీ.గిరీష్మా, వై.రాజు యాదవ్,సాయి కళా,యమ్.వి. సుబ్బారావు, కోశాధికారిగా ఏ.సుభాష్,కార్యవర్గ సభ్యులుగా విజయ్ కుమార్ రామారావుసుబ్బారెడ్డి, సాయి హర్షిత,నాగరాణి,రామ్ రెడ్డి,రాజు గౌడ్,ప్రభాకర్ రెడ్డి,అశుత కులకర్ణి అశోక్ ముదిరాజ్,నరసింహ చారి,మునికొండ రాజకుమార్,నరేష్ కి నియామక పత్రాలు ఇచ్చి వారికి శుభాకాంక్షలు తెలపడం జరిగింది,ఈ సమావేశంలో పాల్గొన్న బీజేపీ శేరిలింగంపల్లి అసెంబ్లీ కన్వీనర్ కే.రాఘవేంద్ర రావు మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీ అయినటువంటి భారతీయ జనతా పార్టీ భారతదేశం అన్ని రంగాలలో అభివృద్ధి చెందే విధంగా మన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో భారత దేశం అభివృద్ధి దిశగా పయనిస్తుంది తెలంగాణ రాష్ట్రంలో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి అధికారంలోకి వచ్చే దిశగా భారతీయ జనతా పార్టీ బలో పేతం కోసం కార్యకర్తలు నిరంతరం కృషి చేయాలి ఈ రోజు మన డివిజన్ హఫీజ్ పేట్ లో బిజెపి నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసి కట్టుగాహఫీజ్ పేట్ డివిజన్ లో బీజేపీ పటిష్ఠం చేసుకొని,రానున్న జిహెచ్ఎంసి ఎన్నికల్లో కార్పొరేటర్ నీ గెలిపించుకునే విధంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని అని అన్నారు ఈ కార్యక్రమంలో హఫీజ్ పెట్ డివిజన్ బిజెపి ప్రభారీ స్వామి గౌడ్,శేరిలింగంపల్లి అసెంబ్లీ బీజేపీ కో - కన్వీనర్ మల్లాపురం మణిభూషణ్,బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి అజిత్ సేనాపతి,మహిళా మోర్చా రాష్ట్ర నాయకురాలు వినయ,మాజీ కౌన్సిలర్ రమణయ్య,బీజేపీ జిల్లా గీతా సెల్ కన్వీనర్ రవి గౌడ్,బీజేపీ మజ్దూర్ మోర్చా జిల్లా అధ్యక్షులు ఆళ్ల వరప్రసాద్,బీజేపీ డివిజన్ నాయకులు పాలం శ్రీనివాస్,అశోక్.జి, కృష్ణంరాజు,మనోజ్ యాదవ్, నవీన్ కుమార్, మహేష్ గౌడ్,సంజు గౌడ్,కన్న యాదవ్,మరియు పోలింగ్ బూత్ అధ్యక్షులు, శక్తికేంద్రం ఇంచార్జ్ లు కార్యకర్తలు పాల్గొన్నారు.

# బాలికపై ఆరుగురు సామూహిక అత్యాచారం..



బెంగళూరు ప్రజా స్వేచ్ఛ

ఆరుగురు వ్యక్తులు బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. వీడియో రికార్డ్ చేసి ఆమెను బ్లాక్‌మెయిల్ చేశారు. మరోసారి ఆ బాలికపై సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డారు. మళ్లీ బెదిరించడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. కర్ణాటకలోని బెలగావిలో ఈ సంఘటన జరిగింది. 15 ఏళ్ల బాలికను ఆమె స్నేహితుడు ఆరు నెలల కిందట బెలగావి శివార్లలోని కొండ ప్రాంతానికి తీసుకెళ్లాడు. తన స్నేహితులతో కలిసి ఆ మైనర్ బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. దీనిని మొబైల్ ఫోన్‌లో రికార్డ్ చేశారు.కాగా, ఈ వీడియోతో బాలికను ఆ వ్యక్తి బ్లాక్‌మెయిల్ చేశాడు. అక్కడకు రాకపోతే వీడియోను సోషల్ మీడియాలో వైరల్ చేస్తామని బెదిరించాడు. మళ్లీ ఆ ప్రాంతానికి ఆమెను రప్పించాడు. తన స్నేహితులతో కలిసి గ్యాంగ్ రేప్‌నకు పాల్పడ్డాడు. మరోసారి దీనిని రికార్డ్ చేశాడు. పదేపదే ఆమెను బెదిరించసాగాడు. మరోవైపు విసిగిపోయిన ఆ బాలిక మే 31న పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోక్సో చట్టంతోపాటు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఆ వెంటనే ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు పోలీస్ అధికారి తెలిపారు. మిగతా నలుగురు నిందితులను అరెస్ట్ చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు వెల్లడించారు

# ఇల్లు లేని నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలి

శివశంకర్ ప్రతాప సింగారం మాజీ సర్పంచ్





ప్రజా స్వేచ్ఛ ఘట్కేసర్ ప్రతినిధి

మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ మండల్ ప్రతాప్ సింగారం లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు పేదవాళ్ళుకు రాలేదు గ్రామస్తులైన నిరుపేద ఇల్లు లేని వారికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలంటూ ప్రతాప్ సింగారం మాజీ సర్పంచ్ శివ శంకర్ ఆధ్వర్యంలో ఇండ్లు లేని బాధితులు అంబేద్కర్ చైరసా వద్ద డబుల్ బెడ్ రూమ్ ల ఇండ్ల వద్ద బైఠాయించి బాధితులు ఆదివారం రోడ్ పై బైఠాయించి నిరసన వక్తం చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇల్లులు ఉన్నవారికె డబుల్ బెడ్ రూమ్ లు కేటాయి సున్నారు అని మాలాంటి నీరుపేదలకు రాజకీయ స్వార్థం తో మాకు అన్యాయం చేసున్నారు అని బాధితులు ఆవేదన వ్యక్తం చేసారు ఈ నిరసనకు మద్దతుగా ఘట్కేసర్ మాజీ బీజేపీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి బాధితులకు అండగా నిలిచి నిరసన వక్తం చేశారు ఈ కార్యక్రమంలో బాధితులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు రాష్ట్ర అవతరణ వేడుకలు

డి.వెంకట స్వామి గ్రామ సెక్రెటరీ వెలటురు



ప్రజా స్వేచ్ఛ పెద్దమండడి ప్రతినిధి

నేడు అనగా జూన్ 2న సోమవారం,రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని న్యూ గ్రామ పంచాయతీ దగ్గర జెండా ఆవిష్కరణ ఉంటుందని వెలటూరు గ్రామ సెక్రెటరీ డి.వెంకట స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ సెక్రెటరీ మాట్లాడుతూ ఎలాంటి లోటు పాట్లకు తావు లేకుండా అట్టహాసంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగేలా గ్రామ పెద్దలు,మరియు యువకులు, మహిళలకు,అన్ని రాజకీయ పార్టీల నాయకులకు, గ్రామంలోని అన్ని కుల సంఘాలకు,న్యూ గ్రామ పంచాయతీ కార్యాలయం దగ్గర ఉదయం 8 గంటలకు, గ్రామ ప్రత్యేక అధికారి గారి అధ్యక్షతన జాతీయ జెండావిష్కరణ జరగనున్న నేపథ్యంలో గ్రామస్తులందరూ విధిగా అందరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గ్రామ సెక్రెటరీ డి.వెంకటస్వామి గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు.

# ఎంపీ మల్లు రవికి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే,కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు



నేటి వాస్తవాలు ప్రజా స్వేచ్ఛ

తెలంగాణ రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ గా ఎన్నికైన నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి ని శంషాబాద్ విమానాశ్రయంలో షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ తో కలిసి స్వాగతం పలికిన మైనార్టీ సేల్ రాష్ట్ర నాయకులు మహ్మద్ ఇబ్రహీంఈ కార్యక్రమంలో బాబర్ అలీ ఖాన్ కృష్ణారెడ్డి,చెందితిరుపతి రెడ్డి,రఘు నాయక్, జంగయ్య,నరేష్ తదితరులు పాల్గొన్నారు

# గోశాల నిర్మాణానికి విరాళం

దిలావర్పూర్- ప్రజా స్వేచ్ఛ

దిలావర్పూర్ మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ కాల్వ లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద గోశాల నిర్మించుటకు కుంటాల మండలంలోని లింబా కె వాస్తవ్యులు ఎర్రోళ్ల శకుంతల వెంకటాద్రి విశ్రాంత ఉపాధ్యాయులు వారి తల్లి ఎర్రోళ్ల రాజు భాయి గారి జ్ఞాపకార్థం 1,50,000 విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అంగూర్ మహేందర్, ధర్మకర్తలు గడ్డం నర్సారెడ్డి, వన్నెపన్ని శివకుమార్, గుమ్మ నరసయ్య , ఆలయ అర్చకులు రాము వెంకటేష్, శ్రీనివాస్, సాదుల రాజేంద్రప్రసాద్, శిరీష తదితరులు పాల్గొన్నారు.

# అమరుల త్యాగ ఫలితమే ఈ తెలంగాణ రాష్ట్రం



మిర్యాలగూడ ప్రజా స్వేచ్ఛ
అమరవీరుల త్యాగ ఫలితమే ఈ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సాధ్యం అయిందని. మాజీ మున్సిపల్ చైర్మన్ తిరునగర్ భార్గవ్, తెలంగాణా ఉద్యమకారులు నారాయణరెడ్డి, దేగ వీటి, సాగర్ లు తెలిపారు. తెలంగాణా ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని స్థానిక అమరవీరుల స్థూపం వద్ద అమరవీరుల స్థూపం నిర్మాణ కమిటి ఆద్వర్యంలో తెలంగాణా అమరవీరుల జెండాను ఆవిష్కరించి ప్రసంగించారు.అన్ని వర్గాల ప్రజలు ఉద్యమంలో భాగస్వామ్యం అయ్యారని చెప్పారు. ఉవ్వెత్తున ఎగిసిన ఉద్యమంతో నాటి కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చి ప్రత్యేక రాష్ట్రాన్ని ప్రకటించారని చెప్పారు. తెలంగాణా రాష్ట్ర ఏర్పాటు కోసం పోరాడిన ఉద్యమకారులకు తగిన ప్రాతినిధ్యం కల్పిస్తేనే న్యాయం చేసిన వారు అవుతారని చెప్పారు. కార్యక్రమంలో ఉద్యమకారులు మారం శ్రీనివాస్, మాలోత్ దశరథ్ నాయక్, అరుణ, వెంకన్న, బంటు వెంకటేశ్వర్లు, దాసరాజు జయరాజు, చేగొండి మురళీ యాదవ్, బిఆర్ఎస్ విద్యార్ది విభాగం రాష్ట్ర కార్యదర్శి షోయబ్, ఖాదర్, హరి, రమేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి జన్మదిన వేడుకలు



నాంపల్లి ప్రజా స్వేచ్ఛ
మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి 57వ జన్మదిన వేడుకలను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కత్తి రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో నాంపల్లి మండల కేంద్రంలో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా బస్టాండ్ సెంటర్లో కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ముఖ్య నేతలు మాట్లాడారు. నాంపల్లి అభివృద్ధి ప్రదాత మునుగోడు అభివృద్ధి రాజగోపాల్ రెడ్డి ద్వారానే సాధ్యమన్నారు. ఇలాంటి పుట్టిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆయురారోగ్యాలతో ఉండాలని పలువురు కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పూల వెంకటయ్య, జిల్లా నాయకులు ఏరెడ్ల రఘుపతి రెడ్డి, రాష్ట్ర కిసాన్ సెల్ మాజీ ఉపాధ్యక్షులు కుంభం కృష్ణారెడ్డి, సీనియర్ మండల నాయకులు పెద్దిరెడ్డి సంజీవరెడ్డి రాజు,పట్టణ అధ్యక్షుడు పానగంటి వెంకటయ్య, మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొమ్ము బిక్షం, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు , ఉప సర్పంచ్లు, వార్డు సభ్యులు, సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# సమాజ సేవ చేయడం మా ప్రయాణం

నేలతల్లి, వ్యవస్థాపకులు చంటి



కడ్తాల్, - ప్రజా స్వేచ్ఛ
8వ తరగతిలో ఉన్నప్పుడు జూన్ 1న నేలతల్లితో నాప్రయాణం ప్రారంభమైంది. 8 సంవత్సరాల పూర్తి చేసుకున్న సందర్భంగా నేలతల్లి సభ్యులు జయేంద్ర ముఖేష్ సిద్దు రాజేజ్, సుఫియాన్, స్వాత్విక, హరణి, హర్షవర్ధని, అందరూ కలిసి భవిష్యత్తు పలు సేవా కార్యక్రమా లు చేయాలని వారు నిర్ణయించారు. ఒక వ్యక్తి నుండి నేడు 1500 మంది సభ్యులతో కలిసి అనేక సేవ కార్యక్రమాలు, కొనసాగిస్తున్న చంటి తెలిపారు. పర్యావరణాన్ని కాపాడేందుకు మొక్కలు నాటడం, పేదవారికి అనాధలకు, వృద్ధులకు, ఆహారం అందించడం, పర్యావరణ కాపాడుకోవడం మన అందరి బాధ్యతని వారన్నారు. ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టాలి పర్యావరణాన్ని పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు నడుం బిగించాలని చంటి తెలిపారు. జరిగింది అని చంటి తెలిపారు. మేము చేసే పలు సేవా కార్యక్రమాలకు సాయి సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సులబ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి.

-ఈ నెల 5వ,తేదీన ప్రధాన కార్యాలయం ఎదురుగా ధర్నా..
-ఐఎఫ్టీయూ సులబ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ డి.బ్రహ్మానందం.

మంచిర్యాల ప్రజా స్వేచ్ఛ
సుమారు 200 మంది సులభ్ కార్మికులు ఇంటర్నేషనల్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఏజెన్సీ ఆధ్వర్యంలో సింగరేణి ప్రాంతాలలో ఉన్న సులాబ్ కాంప్లెక్స్ లలో విధులు నిర్వర్తిస్తున్నారు. యాజమాన్యం నుండి వీరికి రావల్సిన హక్కులు,సౌకర్యాలను వెంటనే అమలు చేయాలని రామకృష్ణాపూర్ లోని ఐఎఫ్టీయూ లో సులబ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ డి బ్రహ్మానందం ఆదివారం సింగరేణి డివిజన్ కమిటీ నిర్వహించిన పాత్రికేయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సింగరేణి లో సుమారు 200 మంది సులభ్ కార్మికులు ఇంటర్నేషనల్ సోషల్ సర్వీస్




ఆర్గనైజేషన్ ఏజెన్సీ ఆధ్వర్యంలో విదుకు నిర్వహించే కార్మికులకు చట్ట బద్ధంగా రావల్సిన హక్కులతోపాటు, అన్ని సౌకర్యాలను యాజమాన్యం కల్పించాలని కోరారు. సింగరేణి యాజమాన్యం నిర్వహించే సులభ కాంప్లెక్స్ కి నెలకు ఒక్కో దానిపై సుమారుగా 25000/ రూపాయలను సులబ్ ఇంటర్నేషనల్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఏజెన్సీ కి చెల్లిస్తుందని,ప్రతి కాంప్లెక్స్ కి ఒక కాంట్రాక్టు కార్మికుడు పనిచేస్తున్నాడని,అలాంటి కార్మికులకు ఎలాంటి భద్రత లేదని,వీరికి కూడ హెచ్ డి ఎఫ్ సి బ్యాంక్ ద్వారా ఎక్స్ గ్రేసియా సౌకర్యం తో పాటు,పెండింగ్ లో ఉన్న ఏరియర్స్ నీ వెంటనే చెల్లించాలని,ఈఎస్ఐ,ఈఫిఎఫ్ అమలు చేయాలని, 8.33% బొనస్ అమలు చేయాలని కోరుతూ,అలాగే రిపేర్ లో ఉన్న సులబ్ కాంప్లెక్స్ లను తక్షణమే రిపేర్ చేయించాలని కోరుతూ... ప్రస్తుత సింగరేణి యాజమాన్యం ఇతర కాంట్రాక్టు కార్మికులకు అమలు చేస్తున్న విధంగా వెంటనే అమలు చేయాలని ఆయన యాజమాన్యాన్నిడిమాండ్ చేశారు. లేనిచో ఈనెల 5వ,తేదీన డివిజన్ ప్రధాన కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సులబ్ డివిజన్ నాయకులు గజ్జి మల్లేష్,ముత్యాల వెంకటేష్, అప్పారావు, నాగరాజు,శ్రీనివాస్, మల్లయ్య,నర్సయ్య, సత్యం, పంజం, మహిళా కార్మికులు ఈశ్వరమ్మ,లక్ష్మి, మల్లు, ప్రెస్కిళ్ళ తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా భాస్కర్ రావు



యాదాద్రి- ప్రజా స్వేచ్ఛ
యాదాద్రి భువనగిరి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా భాస్కర్ రావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించిన గంగాధర్ రెండు నెలల క్రితం హెచ్ఎండీఏ కార్యదర్శిగా బదిలీ అవ్వగా అప్పటి నుంచి రెవెన్యూ కలెక్టర్ వీరారెడ్డి అదనపు బాధ్యతలను నిర్వహించారు. భాస్కరరావు గతంలో యాదాద్రి భువనగిరి జిల్లాలో భువనగిరి ఆర్డీవోగా, జిల్లా అదనపు రెవెన్యూ కలెక్టర్‌గా, యాదగిరిగుట్ట ఆలయ ఈవోగా పనిచేశారు.

# ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు



గండీడ్-01 ప్రజా స్వేచ్ఛ
మహబూబ్ నగర్ జిల్లా గండీడ్ మండలం ఇల్లు లేని నిరుపేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడం జరుగుతుందని గండీడ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జితేందర్ రెడ్డి ఆదివారం గండీడ్ అంచన్ పల్లి గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ళకి ముగ్గు వేసి ఇంటి నిర్మాణానికి భూమి పూజ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇడ్లను అందజేస్తుందని కాంగ్రెస్ అంటేనే పేదల ప్రభుత్వమని గతంలో కాంగ్రెస్ ఉన్నప్పుడు ఇందిరమ్మ ఇల్లు ఎందరో పేదలకు నిర్మించి ఇచ్చామని తెలిపారు. కార్యక్రమంలో. గండీడ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జితేందర్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, గండీడ్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి, వెన్నాచెడు మాజీ సర్పంచ్ పుల్లారెడ్డి, మాజీ ఎంపిటిసి బాలయ్య, చెన్నారెడ్డి నరసింహారెడ్డి, భగవంతు రెడ్డి, సుదర్శన్ రావు మధు గౌడ్ వెంకన్న గౌడ్, చెన్నప్ప, వెంకటేష్, కార్యదర్శులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# రైతు రుణమాఫీ, రైతుభరోసా వెంటనే విడుదల చేయాలి

-తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వీరేపల్లి వెంకటేశ్వర్లు

మిర్యాలగూడ ప్రజా స్వేచ్ఛ
రెండు లక్షల లోపు రైతు రుణమాఫీ, మూడు సీజన్లకు సంబంధించిన రైతు భరోసా ఈ సీజన్లో వెంటనే విడుదల చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వీరేపల్లి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక రైతు సంఘం కార్యాలయంలో ఆ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీల భాగంగా వ్యవసాయ పెట్టుబడులకు అవసరమైన రైతు భరోసా మూడు సీజన్ నుండి పెండింగ్లో ఉందని ఈ వాన కాలం సీజన్తో కలుపుకొని వెంటనే విడుదల చేయాలని కోరారు. రైతు భరోసా అందాక రైతులు ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను



ఆశ్రయించి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని గుర్తు చేశారు. రెండు లక్షల లోపు పెండింగ్లో ఉన్న 12 వేల కోట్ల రుణమాఫీకి నిధులు వెంటనే విడుదల చేయాలన్నారు. అందరికి రుణమాఫీ అయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ వాన కాలం సీజన్ లో నకిలీ విత్తనాలను, పురుగుల మందులను అరికట్టాలని డిమాండ్ చేశారు. భూసారాన్ని పెంచే జీలుగు ధర ను ప్రభుత్వం భారీగా పెంచిందని అలా కాకుండా జీలుగు, పెసర, అలసంద లను ఉచితంగా పంపిణీ చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం స్వామినాథన్ కమిషన్ అమలు చేయాలని, పెంచిన ఎరువుల ధరలను తగ్గించాలని కోరారు. స్వామినాథన్ కమిషన్ సూచనల ప్రకారం కనీసం మద్దతు ధర నిర్ణయించాలని, దాని అమలు కోసం గ్యారెంటీ చట్టాన్ని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు పోలేపల్లి గోవింద్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి నాయకులు వస్కుల సూర్యం, ఉన్నం వెంకటేశ్వర్లు, పర్వతం లింగయ్య, కృష్ణయ్య, రవి నాయక్, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రాజమాత అహల్యాబాయి హెూల్కర్ 300వ జయంతి వేడుకలు

కుత్బుల్లాపూర్ - ప్రజా స్వేచ్ఛ
రాజమాత అహల్యాబాయి హెూల్కర్ 300వ జయంతి ఉత్సవాల సందర్భంగా బిజెపి రాష్ట్ర పిలుపుమేరకు సుభాష్ నగర్ 130 డివిజన్ అధ్యక్షులు శంపూర్ విజయేందర్ రెడ్డి ఆధ్వర్యంలో జీడిమెట్ల బస్ డిపో వద్ద రాజ్ మాత అహల్య భాయ్ హెూల్కర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యులు ఎం ఎస్ వాసు, జిల్లా ఇండస్ట్రియల్ సెల్ కన్వీనర్ గిరిబాబు,డివిజన్ నాయకులు విగ్నేష్ ముదిరాజ్, శ్రీనివాస్ గుప్తా, మోహన్, అర్జున్, మారుతి నాయుడు ,శ్రీనివాస్, వీరేష్, మహేష్, నరేష్, డివిజన్ బీజేవైఎం నాయకులు బబ్లు, చందు, సాయి, రాహుల్, శ్రీకాంత్, హరి, సాయి, పండు, దినేష్ డివిజన్ ముఖ్య నాయకులు పాల్గొనడం జరిగింది.

# ఆర్యవైశ్యుల ఐక్యతకు కృషి..

ఆర్యవైశ్య సంఘం వనపర్తి పట్టణ అధ్యక్షుడు బచ్చు రాము

వనపర్తి,- ప్రజా స్వేచ్ఛ
ఆర్యవైశ్య సంఘం వనపర్తి పట్టణ అధ్యక్షుడిగా బచ్చు రాము ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఎన్నికల్లో పోటీలో ఉన్న అభ్యర్థి పోటీ నుంచి తప్పుకోవడంతో ఏకైక అభ్యర్థిగా మిగిలిన బచ్చు రామును ఆర్యవైశ్య మహాసభ జిల్లా ప్రతినిధులు వెల్లడించారు.బచ్చు రాము



మాట్లాడుతూ 30 సంవత్సరాలుగా చేస్తున్న సేవలకు గౌరవం దక్కిందని అన్నారు ఆర్య వైశ్యుల ఐక్యతకు కృషి చేస్తూ ఆర్యవైశ్యులకు అందుబాటులో ఉంటూ సహకారాలు అందిస్తానని తెలిపారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన బచ్చు రామును పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు అభినందించారు.ఈ కార్యక్రమంలో గోనూరు వెంకటస్వామి, వీరయ్య గుప్తా, నాగబంది యాదగిరి, మారం బాలీశ్వరయ్య, సంబు వెంకటేష్, పూరి బాలరాజ్, దేవరాజ్, బచ్చు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. ం

# అఖిల్ 'లెనిన్'లో అనన్య పాండే స్పెషల్ సాంగ్?

టాలీవుడ్ యువ హీరో అక్కినేని వారసుడు అఖిల్ తన కెరీర్‌లో ఒక్క బ్లాక్‌బస్టర్ హిట్ అయిన కొట్టాలని ఎంతగానో ఎదురుచూస్తున్న విషయం తెలిసిందే. గత చిత్రం 'ఏజెంట్' ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోవడంతో, తన తదుపరి సినిమాల విషయంలో అఖిల్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాడు. ఈ క్రమంలోనే ఆయన ఒక కొత్త దర్శకుడితో సినిమా చేస్తున్నాడు. అఖిల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ తాజా చిత్రం పేరు 'లెనిన్'.ఈ సినిమాకు మురళీ కిషోర్ అబ్బూరి దర్శకత్వం వహిస్తుండగా, అఖిల్ సొంత నిర్మాణ సంస్థ అన్నపూర్ణ స్టూడియోస్‌తో పాటు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లపై అక్కినేని నాగార్జున, నాగ వంశీ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే నుంచి టైటిల్ గ్లింప్స్‌ను విడుదల చేయగా.. రూరల్ బ్యాక్‌డ్రాప్‌లో రాబోతున్న ఈ గ్లింప్స్ ఆకట్టుకుంది. అయితే ఈ సినిమాకు సంబంధించి ఒక వార్త వైరల్‌గా మారింది. ఈ సినిమాలో ఒక స్పెషల్ సాంగ్ ఉండగా.. ఆ సాంగ్‌ని బాలీవుడ్ నటి అనన్య పాండేతో చేయిస్తే బాగుంటుందని చిత్రబృందం అనుకుంటున్నట్లు సమాచారం. కాగా దీనిపై అధికారికంగా ప్రకటన రావాల్సి ఉంది. ఇక ఈ చిత్రంలో శ్రీలీల కథానాయికగా నటిస్తుండగా, ఎస్. థమన్ సంగీతం అందిస్తున్నారు.






# ఇంట్రెస్టింగ్‌గా 'శ్రీ శ్రీ శ్రీ రాజావారు' ట్రైలర్

టాలీవుడ్ అగ్ర కథానాయకుడు జూనియర్ ఎన్టీఆర్ బావమరిది నార్నే నితిన్ గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. మ్యాడ్, ఆయ్ చిత్రాలతో తనకంటూ యూత్‌లో మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు ఈ కుర్ర హీరో. అయితే నితిన్ సోలోగా ఎంట్రీ ఇస్తున్న తాజా చిత్రం శ్రీ శ్రీ శ్రీ రాజవారు. ఇప్పటివరకు మల్టీస్టారర్‌లో నటించిన నితిన్ తాజాగా శ్రీ శ్రీ శ్రీ రాజవారుతో డెబ్యూ ఇవ్వబోతున్నాడు. 'శతమానం భవతి' వంటి నేషనల్ అవార్డు మూవీ తీసిన దర్శకుడు సతీష్ వేగేశ్న ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుంగడగా.. శ్రీ వేదాక్షర మూవీస్ పతాకంపై చింతపల్లి రామారావు ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. ఈ మూవీ జూన్ 6, 2025 ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. తాజాగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్.ఈ ట్రైలర్ చూస్తుంటే.. సిగరెట్‌కి అలవాటయిన ఒక యువకుడి చుట్టూ కథ ఉండబోతున్నట్లు తెలుస్తుంది. నితిన్‌తో పాటు ఈ సినిమాలో రావు రమేష్, నరేష్, రఘు కుంచె, ప్రవీణ్, రచ్చ రవి, సరియు, రమ్య, ప్రియ మచిరాజు, భద్రం, ఆనంద్, జబర్దస్త్ నాగి తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కైలాష్ మీనన్ సంగీతం అందిస్తున్నాడు.




# మ్యాడ్ హీరో గ్యాంబ్లర్స్ ట్రైలర్ మాములుగా లేదుగా..

## పక్కా హిట్టేనా?

మ్యాడ్', 'మ్యాడ్ స్క్వేర్' సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన సంగీత్ శోభన్ ఇప్పుడు తన ప్రధాన పాత్రలో గ్లాంబ్లర్స్ అనే చిత్రంతో ప్రేక్షకులని పలకరించేందుకు సిద్ధమయ్యాడు. ఎప్పుడో విడుదల కావలసిన ఈ చిత్రాన్ని ఇప్పుడు థియేటర్స్‌లోకి తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు. ప్రమోషన్స్ జోరుగా చేస్తూ సినిమాపై ఆసక్తిని పెంచుతున్నారు. నాలుగు రోజుల క్రితం టీజర్, ఫస్ట్ సాంగ్ ను రిలీజ్ చేసారు. తాజాగా ట్రైలర్ ను ఆవిష్కరించారు.'ఆడటం చేతగాని వాడికి జూదం అంటే నేరం అనిపిస్తుంది.. ఆడటం తెలిసిన వాడికి జూదం నేరం కాదు ' అంటూ ప్రారంభమైన ఈ ట్రైలర్ లో ఒక క్లబ్ లో జరిగే సన్నివేశాలను చూపించారు.ఇందులో కొందరు వ్యక్తులు క్లబ్ లో గేమ్ ఆడటం, హీరో వాళ్ళతో ఏదో డీల్ సెట్ చేసుకోవడం, దాని వెనుక ఇంకేదో మిస్టరీ ఉందని అనుకునేలా ఈ ట్రైలర్ ఉంది.ఈ చిత్రంలో మిస్టరీతో పాటు ఎంటర్‌టైన్‌మెంట్ దండిగా ఉంటుందని అర్ధమవుతుంది. మ్యాడ్, 'మ్యాడ్ స్క్వేర్' సినిమాల్లో కామెడీతో ఆకట్టుకున్న సంగీత్ శోభన్.. గ్యాంబ్లర్స్ అనే చిత్రంలో చాలా భిన్నమైన పాత్రలో కనిపించనున్నారు. కౌబాయ్ తరహా కాస్ట్యూమ్స్ లో కనిపించి ఆకట్టుకున్నారు. ప్రశాంతి చారులింగా, రాకింగ్ రాకేష్, పృథ్వీరాజ్, సాయి శ్వేత, జస్విక, భరణి శంకర్, మల్హోత్ర శివ, శివారెడ్డి, శ్రీకాంత్ అయ్యంగార్, మధుసూదన్ రావు తదితరులు ఈ చిత్రంలో ఇతర పాత్రలు పోషించారు

# ఆడితే వెరీగుడ్.. ఆడకపోతే బ్యాడ్‌లక్!

అందం, మానసిక పరిపూర్ణత అలంకారాలుగా చేసుకున్న నటి రష్మిక మందన్నా. బాలీవుడ్‌లో ఆమె నటించిన, యానిమల్, చావా చిత్రాలు భారీ విజయాలను నమోదు చేయగా, సల్మాన్‌ఖాన్‌తో ఆమె నటించిన 'సికిందర్' సినిమా మాత్రం చేదు అనుభవాన్నే మిగిల్చింది. ఈ విషయంపై ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆమె స్పందించింది. 'జీవితంలో ఏదీ శాశ్వతం కాదు. ఈ రోజు ఉన్నట్టు రేపు ఉండదు. అదే జీవితం. మనం ఏ పరిస్థితుల్లో ఉన్నా కుటుంబ సభ్యుల నుంచి, స్నేహితుల నుంచి మద్దతు లభిస్తున్నదీ అంటే.. ఇక మనకు మించిన అదృష్టవంతులు వేరొకరు లేరని అర్థం.నేను చేసే ఏ సినిమా విషయంలోనూ ఎక్స్‌పెక్టేషన్స్ పెట్టుకోను. అది బాగా ఆడితే వెరీగుడ్. ఆడపోతే బ్యాడ్‌లక్..అంతే.' అని చెప్పుకొచ్చింది రష్మిక. ఇంకా చెబుతూ 'జీవితంలో కఠినమైన పాఠాలుండవ్. అన్నీ విలువైన పాఠాలే ఉంటాయి. మనం వాటిని తీసుకునే విధానంలోనే తేడా ఉంటుంది. ఈ సందర్భంగా అందరికీ నేనిచ్చే సలహా ఒక్కటే. ఇతరులను సంతోషపెట్టాలనే భారాన్ని మాత్రం మోయకండి. మీ ఆనందంపై దృష్టి పెట్టండి. అప్పుడు మీ కుటుంబాలు కూడా బావుంటాయి.' అని పేర్కొన్నది రష్మిక మందన్నా.



# అదే నా చివరి చిత్రం కావొచ్చు

## అమీర్ కామెంట్స్.. షాక్‌లో ఫ్యాన్స్

బాలీవుడ్ మిస్టర్ పర్‌ఫెక్ట్ ఆమీర్ ఖాన్ చేయని ప్రయోగం లేదంటే అతిశయోక్తి కాదేమో. కెరీర్‌లో వైవిధ్యమైన చిత్రాలు చేసిన ఆయన ఎన్నో వెరైటీ పాత్రలు పోషించి అలరించారు. ఇప్పటికీ అదే శైలిలో నడుస్తున్నారు. అందుకే అభిమానులు ఆయనని ముద్దుగా బాలీవుడ్ మిస్టర్ పర్‌ఫెక్ట్ అంటుంటారు. ఆమీర్ ఖాన్ త్వరలో 'సీతారే జమీన్ పర్' అనే చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. ఈ చిత్రం జూన్ 20న విడుదల కానున్న నేపథ్యంలో ప్రమోషన్స్‌లో యాక్టివ్‌గా పాల్గొంటున్నాడు. ఈ క్రమంలో రీసెంట్‌గా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమిర్, తాను చాలా ఏళ్లుగా కలలు కంటున్న 'మహాభారతం' ప్రాజెక్ట్ గురించి కీలక వ్యాఖ్యలు చేశారు.మహాభారతం చిత్రం అనేది తన చిన్నప్పటి కల అని అన్నారు. ప్రపంచంలో ఉన్న ప్రతీ భావోద్వేగం, ప్రతి మానవ సంబంధం మహాభారతంలో కనిపిస్తుంది. నేను దాన్ని సినిమా రూపంలో మలచాలని కోరుకుంటున్నాను అని చెప్పారు. ఈ సినిమా నా కెరీర్‌లో చివరి సినిమా కూడా కావొచ్చు అని ఆయన తెలియజేశారు. ఇలాంటి గొప్ప కథ తర్వాత నాకు ఇంకా ఏం చేయాలో కూడా అర్థం కాని పరిస్థితి. నాకు పని చేస్తూ చనిపోవాలని ఉంది కాని, బహుశా ఇదే చివరి సినిమా అవుతుందని ఆమీర్ అన్నారు. ఈ కామెంట్స్‌తో ఫ్యాన్స్ షాక్‌లో ఉండిపోయారు. మీరు ఎన్నో గొప్ప సినిమాలు చేయాలి, ఇప్పుడే రిటైర్మెంట్ ఆలోచన చేయకండి అని కొందరు కామెంట్స్ చేస్తున్నారు. ఆమిర్ ప్రస్తుతం మూడు ప్రాజెక్ట్స్ తో బిజీగా ఉన్నారు. 'హ్యాపీ పటేల్', 'చార్ దిన్ కీ చాందనీ', 'మహాభారతం'తో పాటు జోయా అక్తర్ సినిమాలో కూడా నటిస్తున్నారు. అయితే మహాభారతం మాత్రం ఆమిర్ డ్రీమ్ ప్రాజెక్ట్ అంటున్నారు. అయితే రాజమౌళి కూడా మహాభారతం తన డ్రీమ్ ప్రాజెక్ట్ అని చెప్పినా ఆయన ఆ వైపు అడుగులు వేయలేదు. అయితే జక్కన్న కన్నా ముందు ఆమీర్ ఖాన్ రంగంలో దిగడం చర్చనీయాంశంగా మారింది. ఈ ఏడాది ప్రీ ప్రొడక్షన్ పనులు మొదలు పెట్టనున్నట్లు చెప్పారు. అయితే స్క్రిప్ట్ రాయడానికి టైం పడుతుందని.. పైగా అన్ని క్యారెక్టర్లను ఒకే సినిమాలో చూపించలేం కాబట్టి సీరిస్ గా దీన్ని తెరపైకి తీసుకొస్తానంటూ పేర్కొన్నారు.





Printed published and woned by Tarigolpula Lakshmi, mahender ,printers karshak Art Printers, Hyderabad and published by office 2-6-376, Jaipuri colony,Nogole village,Uppal mandal, district Ranga Reddy,Post GSI,500068-Telangana RNI NO.APTEL/2012/46853 . Email ID : Prajaswecha@gmail.com, website, www.Prajaswecha.com cell 9381910611, 79892 89492